www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

FLASH INDIA NEWS ప్రతిక్షణం.. ప్రజలకోసం...

విలేకరులు కావలెను

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 132 | శుక్రవారం 26.06.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-



## వెనెజువెలాకు భారత్ అండ..

సహాయ సహకారాలు అందిస్తామన్న ప్రధాని మోడీ..

వెనెజువెలాను వణికించిన జంట భూకంపాలు

మోడీ సంతాపం.. భారత్ సహాయానికి సిద్ధం

- వెనెజువెలా భూకంపాలపై ప్రధాని మోడీ సంతాపం
- బాధితులకు భారత్ పూర్తి సహాయం అందించేందుకు సిద్ధం
- 7.2, 7.5 తీవ్రతతో వెనెజువెలాలో జంట భూకంపాలు
- కూలిన భవనాలు.. భయంతో రోడ్లపైకి ప్రజలు

02

## ప్రభుత్వం, చట్టం ఏమి చెబుతోంది?

పౌరసత్వానికి పాస్‌పోర్ట్ సరిపోదా?

కేంద్ర వివరణతో మళ్లీ హాట్ టాపిక్

- పాస్‌పోర్ట్ పౌరసత్వానికి రుజువు కాదన్న కేంద్రం
- కేంద్ర ప్రకటనతో దేశవ్యాప్తంగా చర్చ
- ఇది కొత్త నిర్ణయం కాదన్న కేంద్ర ప్రభుత్వం
- పాస్‌పోర్ట్ చట్టం-1967లోని సెక్షన్ 20 ప్రస్తావన
- ప్రత్యేక పరిస్థితుల్లో పౌరులు కానివారికీ పాస్‌పోర్ట్ అవకాశం
- 2013 బాంబే హైకోర్టు తీర్పును గుర్తుచేసిన కేంద్రం


02



## విద్యార్థులకు షాక్..

- ప్రైవేట్ కాలేజీలకు తాత్కాలిక ఉపశమనం
- ఫీజు రీఇంబర్స్‌మెంట్ బకాయిలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కోర్టు
- ఆగస్ట్ 15లోపు బకాయిలు చెల్లిస్తామని హామీ
- విద్యార్థుల ప్రయోజనాలపై హైకోర్టు దృష్టి

02







# పరిష్కారమే కావాలి

## తుంగభద్రకు కొత్త ఊపిరి..

పంచాయతీలు వద్దు.. పరిష్కారమే కావాలి: సీఎం రేవంత్

6 నెలల్లో 33 గేట్ల పునరుద్ధరించాం: సీఎం చంద్రబాబు

ముగ్గురం సీఎంలు కలిసి చరిత్ర సృష్టిస్తాం: డీకే శివకుమార్

- తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ చరిత్రలో నిలుస్తుంది: రేవంత్
- మూడు రాష్ట్రాల నీటి సమస్యలకు పరిష్కార దిశగా అడుగులు
- తుంగభద్ర డ్యాంలో కొత్త స్పిల్‌వే గేట్ల ప్రారంభం
- రేవంత్, చంద్రబాబు, డీకే శివకుమార్ ఒకే వేదికపై
- పాలమూరు వలసలకు చెక్ పెట్టే ప్రయత్నమన్న సీఎం
- ఆర్డీఎస్ రైతులకు న్యాయం జరగాలని రేవంత్ ఆకాంక్ష
- నీటి వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- తుంగభద్ర నుంచి తెలంగాణకు రావాల్సిన నీటిపై చర్చలు
- 6 నెలల్లో 33 గేట్ల పునరుద్ధరణ పూర్తి: చంద్రబాబు
- నదుల అనుసంధానం నా కలల ప్రాజెక్ట్: చంద్రబాబు
- ముగ్గురు సీఎంల సమావేశం చరిత్రాత్మకం: డీకే శివకుమార్
- మూడు రాష్ట్రాల రైతుల అభ్యున్నతికి సంయుక్త కృషి

02

**మునీరాబాద్ :**
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సాగు, తాగునీటి అవసరాలను తీర్చే ప్రధాన వరప్రదాయిని తుంగభద్ర డ్యామ్ సరికొత్త రూపు సంతరించుకుంది. గత 2024 వరదల్లో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో, నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు నిర్మించిన 33 క్రెస్ట్ గేట్లను గురువారం (జూన్ 25) ముగ్గురు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో కలిసి ఘనంగా ప్రారంభించారు. రూ. 51 కోట్ల వ్యయంతో కేవలం 6 నెలల రికార్డు కాలంలోనే ఈ గేట్ల నిర్మాణాన్ని పూర్తి చేయడం విశేషం.

**మూడు తరాల సమస్యకు శాశ్వత పరిష్కారం**

గేట్ల ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో తెలంగాణ...



## చింతబలిగె ఇరుగుద్ది..



## రూ.1.5 కోట్ల వరకు ప్రమాద బీమా కవరేజీ

- ప్రభుత్వ ఉద్యోగులకు సీఎం రేవంత్ గుడ్ న్యూస్
- ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత ప్రమాద బీమా పథకం
- 14 బ్యాంకులతో రాష్ట్ర ప్రభుత్వ కీలక ఒప్పందం
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకూ బీమా వర్తింపు
- రూ.1.5 కోట్ల వరకు ప్రమాద బీమా కవరేజీ
- పదవీ విరమణ తర్వాత కూడా బీమా ప్రయోజనాలు
- ఉద్యోగుల సంక్షేమంలో తెలంగాణ మరో ముందడుగు
- ఉద్యోగులే ప్రభుత్వానికి వారధులు: రేవంత్

03

ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రెగ్యులర్ ఉద్యోగులు సహా.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు కూడా ఉచిత బీమా కల్పించేలా సీఎం రేవంత్ రెడ్డి 14 బ్యాంకులతో MoU కుదుర్చుకుని, ఉద్యోగులు, పెన్షనర్ల ప్రమాద బీమా పథకానికి శ్రీకారం చుట్టారు. రవీంద్ర భారతిలో ఆయా MoUలపై సీఎం సంతకాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంస్థ లేదా ప్రభుత్వం కోసం కష్టపడేవారికి అండగా ఉండాల్సిన బాధ్యత యజమానిదే నన్నారు. దీనిని ఉద్యోగులు అడగకపోయినా ప్రభుత్వమే ఒకడుగు ముందుకు వేసిందన్నారు. ఉద్యోగులందరికీ ఇన్సూరెన్స్ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

## తెలంగాణలో జనసేన దూకుడు




- తెలంగాణలో జనసేన స్పీడ్ పెంచిన పవన్ పార్టీ
- పార్టీ బలోపేతానికి కీలక నిర్ణయం
- జూన్ 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమీక్షా సమావేశాలు
- పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా జనసేన రివ్యూ
- 10 రోజుల పాటు విస్తృత స్థాయి సమావేశాలు
- సికింద్రాబాద్ నుంచి నిజామాబాద్ వరకు షెడ్యూల్

03

## జనం కోసం పనిచేసే వారే సమాజానికి ఆదర్శం

- పదవి విరమణ చేశా.. పెదవి విరమణ చేయలేదన్న వెంకయ్య
- యువతకు జ్ఞానం పంచేందుకే దేశవ్యాప్త పర్యటన
- సేవా భావంతో సమాజ అభివృద్ధికి కృషి చేయాలి

03

# నీటి వాటాకు సీఎం తూట్లు

## శాశ్వతంగా మన హక్కులు కోల్పోయే ప్రమాదం



ఏపీ, కర్ణాటక సీఎంలతో ఆ మాట చెప్పించండి

నాడు కేసీఆర్ నేడు రేవంత్

తెలంగాణ సాధించుకొని 12 ఏళ్లు గడిచిన తర్వాత కూడా మనం పూర్తిస్థాయిలో కృష్ణా, తుంగభద్రలో మన నీటిని వాడుకోలేదని, ఆర్డీఎస్ ప్రాజెక్ట్ నడిగడ్డను బతికించి...ఉమ్మడి మహబూబ్ నగర్‌కు ఉపయోగపడే ప్రాజెక్ట్ అన్నారు. ఆర్డీఎస్‌లో మనకు 16 టీఎంసీల వాటా ఉంటే ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ వచ్చిన తర్వాత కానీ 6 టీఎంసీల కన్నా ఎక్కువ వాడుకోలే

- తుంగభద్ర జలాలపై సీఎం రేవంత్ వైఖరిని తప్పుబట్టిన కవిత
- కర్ణాటక ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వొద్దని డిమాండ్
- ఆర్డీఎస్ నీటి హక్కులు కోల్పోయే ప్రమాదమన్న హెచ్చరిక
- అఖిలపక్షంతో సెంట్రల్ వాటర్ కమిషన్ వద్ద పోరాటం చేయాలి
- నడిగడ్డకు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతోందన్న కవిత
- కృష్ణా, తుంగభద్ర జలాల వినియోగంలో తెలంగాణ వెనుకబడిందా?
- ఆర్డీఎస్ చుట్టూ కర్ణాటక కొత్త ప్రాజెక్టులపై ఆందోళన
- 10 టీఎంసీల నీటి వినియోగానికి కర్ణాటక ప్రణాళికల ఆరోపణ
- నేడు రేవంత్, నాడు కేసీఆర్ పట్టించుకోలేదన్న విమర్శ

03



## ఇకపై వ్యక్తికి 7 కేజీల రేషన్!

గరిష్టంగా 35 కిలోల కోటా కొనసాగింపు

జూలై 13 వరకు సూచనలు, అభిప్రాయాలకు అవకాశం

- అంత్యోదయ రేషన్ పంపిణీలో కేంద్రం కీలక మార్పులు
- వ్యక్తికి 7 కిలోల రేషన్ ప్రతిపాదించిన కేంద్రం
- జాతీయ ఆహార భద్రత చట్టంలో సవరణలకు శ్రీకారం
- కుటుంబం కాకుండా వ్యక్తి ప్రాతిపదికన రేషన్ పంపిణీ
- గరిష్టంగా 35 కిలోల కోటా కొనసాగింపు
- చిన్న కుటుంబాలకు రేషన్ కోత పడే అవకాశం
- అసమానతలు తొలగించేందుకే కొత్త విధానమన్న కేంద్రం

05

## అక్కసుతోనే అడ్డగోలు మాటలు..



- ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రకు శ్రీకారం
- గిరిజన సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- కేటీఆర్, హరీశ్‌రావుపై మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు
- అధికారం కోల్పోయిన అక్కసుతోనే విమర్శలన్న టీపీసీసీ చీఫ్
- ఎస్టీ రిజర్వేషన్లలో ఇందిరాగాంధీ పాత్రను గుర్తుచేసిన కాంగ్రెస్
- లంబాడీల అభ్యున్నతికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది
- గుడిసెలు లేని గ్రామాలే కాంగ్రెస్ లక్ష్యం
- అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిపక్షాలకు నచ్చడం లేదన్న మహేష్

02



## ఈనెల 28న నల్లగొండకు సీఎం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 28న నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా సుమారు రూ.13,000 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న ఆర్అండ్బీ హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పటికే నల్లగొండలో అధికారులతో సమీక్ష నిర్వహించి, అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ పర్యటన కోసం సీఎం హైదరాబాద్ నుండి హెలికాప్టర్‌లో బయలుదేరి నల్లగొండ జిల్లా కనగల్ మండలం చేరుకుంటారు. అక్కడ మొదట మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో కనగల్ మండలం AMC మార్కెట్ యార్డు వద్ద నిర్మించిన హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ఆవిష్కరించనున్నారు. అనంతరం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొదటి ఫేజ్ డ్రింకింగ్ వాటర్ అందించే పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

**ఎన్జీ కాలేజీ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ:**
అభివృద్ధి పనుల శంకుస్థాపనల అనంతరం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీ మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతారు. ఈ సభలో సీఎం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం, జిల్లాకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళా ప్రతినిధులకు ప్రభుత్వం తరఫున చెక్కులను పంపిణీ చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి.

## అక్కసుతోనే అడ్డగోలు మాటలు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ కాంగ్రెస్ గిరిజన నేతలు చేపట్టిన ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్, హరీశ్‌రావు శకం గతమని.. అధికారం పోయిందన్న అక్కసుతో వారిద్దరూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇందిరాగాంధీ.. ఎస్టీ రిజర్వేషన్ ఇవ్వకపోయి ఉంటే నేడు లంబాడీలు, ఎరుకల, యానాదిలు ఈ స్థాయిలో ఉండేవాళ్లు కాదన్నారు. లంబాడీల బాగు కోసం పనిచేసే ప్రభుత్వం తమది అని స్పష్టం చేశారు. ఇందిరాగాంధీ గుడిసెలు లేని గ్రామాలు కావాలని అనుకున్నారని.. ఆ దిశగానే తాము ముందుకు వెళ్తున్నామని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి.. బావాబామ్మర్దులకు నచ్చడం లేదని మహేష్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు తగ్గకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. 1 లక్ష 78 వేల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు తీసుకొచ్చామని తెలిపారు. ఫ్యూచర్ సిటీని మొదలు పెట్టి 5 లక్షల 78 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెప్పారు. బస్సు యాత్ర ముగింపు కార్యక్రమానికి ప్రియాంక గాంధీని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ లంబాడ ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు.

## వెనెజువెలాకు భారత్ అండ..

### సహాయ సహకారాలు అందిస్తామన్న ప్రధాని మోడీ..



**న్యూ ఢిల్లీ :** వెనెజువెలాలో సంభవించిన భీకర జంట భూకంపాల పట్ల భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విపత్తు సృష్టించిన విధ్వంసంపై గురువారం సోషల్ మీడియా వేదికగా (X) స్పందించిన ఆయన.. బాధితులకు, వెనెజువెలా ప్రభుత్వానికి భారతదేశం తరఫున ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ కష్టకాలంలో వెనెజువెలాకు అవసరమైన అన్ని రకాల సహాయసహకారాలను అందించేందుకు భారతదేశం సిద్ధంగా ఉందని మోడీ స్పష్టం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.బుధవారం సాయంత్రం వెనెజువెలా కరిబియన్ తీరంలో సంభవించిన ఈ జంట భూకంపాల (7.2 మరియు 7.5 తీవ్రత) ధాటికి దేశంలోని పలు ప్రాంతాల్లో భవనాలు కూలిపోయి జనం భయాందోళనలకు గురయ్యారు. ఈ భూకంపాల ప్రకంపనలు దాదాపు 1700 కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్రెజిల్‌లోని అమెజాన్ ప్రాంతం వరకు కూడా తెలిసివచ్చాయి. భూకంప తీవ్రతకు గోడలు కూలిపోవడం, నగరాల్లో పెద్ద ఎత్తున ధూళి మేఘాలు కమ్మేయడంతో రాజధాని కరాకస్ సహా పలు నగరాల్లో ప్రజలు ఇళ్ల నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. యూఎస్ జియోలాజికల్ సర్వే ప్రకారం.. ఒక శతాబ్ద కాలంలో వెనెజువెలాలో నమోదైన అత్యంత శక్తివంతమైన భూకంపాలలో ఇవి ఒకటిగా నిలిచాయి. మోరోన్ నగరానికి పశ్చిమంగా కేవలం ఒక్క నిమిషం వ్యవధిలోనే ఈ రెండు భూకంపాలు సంభవించాయి.వెనెజువెలా తాత్కాలిక ప్రెసిడెంట్ డెల్సీ రోడ్రిగ్జ్ మాట్లాడుతూ.. పలు రాష్ట్రాల్లో ఆస్తి నష్టం జరిగిందని ధృవీకరించారు, అయితే మరణాల సంఖ్యపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. రాజధానిలోని ప్రధాన విమానాశ్రయమైన 'సిమోన్ బొలివర్ అంతర్జాతీయ విమానాశ్రయం' తీవ్రంగా దెబ్బతినడంతో దాన్ని మూసివేశామని, దేశవ్యాప్తంగా పాఠశాలలకు కొన్ని రోజుల పాటు సెలవులు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండటంతో దేశంలోని ఆరోగ్య సిబ్బంది అందరూ అత్యవసర విధులకు హాజరుకావాలని ఆదేశించారు. కాగా, ఫాల్కన్ రాష్ట్ర గవర్నర్ విక్టర్ క్లార్క్ అందించిన సమాచారం ప్రకారం.. అక్కడ 32 మంది ఆసుపత్రి పాలయ్యారని, శిథిలాల కింద చిక్కుకున్న మరో 15 మందిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.




## విద్యార్థులకు షాక్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలోని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలకు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం (హైకోర్టు)లో స్వల్ప ఊరట లభించింది. విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేయవద్దంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన 'జీవో నంబర్ 9' (GO 9) లోని కొన్ని మార్గదర్శకాలపై హైకోర్టు స్టే విధించింది. ఈ వివాదంపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. వచ్చే మంగళవారం వరకు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

**ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు**
విచారణ సందర్భంగా ఫీజ్ రీఇంబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులపై హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించింది. "మీరు కాలేజీలకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించరు.. అటు విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేయవద్దని కాలేజీలను ఆదేశిస్తే, ఇక వారు విద్యాసంస్థలను ఎలా నడుపుతారు?" అని కోర్టు నిలదీసింది. ఫీజ్ రీఇంబర్స్‌మెంట్ కోసం బడ్జెట్‌లో ఎంత మొత్తాన్ని కేటాయించారో చెప్పాలని ఆదేశించింది. బడ్జెట్ సమావేశాలు ముగిసినా బకాయిలను ఎందుకు విడుదల చేయలేదని, పెండింగ్ నిధులను ఎప్పటిలోగా చెల్లిస్తారో స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని కోరింది.

**ఆగస్ట్ 15 లోపు క్లియర్ చేస్తాం: ప్రభుత్వ న్యాయవాది**
హైకోర్టు ప్రశ్నలకు ప్రభుత్వ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. రాబోయే ఆగస్ట్ 15 లోపు ఫీజ్ రీఇంబర్స్‌మెంట్‌కు సంబంధించిన బకాయిలన్నీ క్లియర్ చేసామని కోర్టుకు వివరించారు. దీనిపై ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు స్పందిస్తూ.. ప్రభుత్వం అన్నట్లుగా ఆగస్ట్ 15 లోపు బకాయిలన్నీ పూర్తిగా చెల్లిస్తే, తాము దాఖలు చేసిన పిటిషన్లన్నింటినీ అదే రోజున వెనక్కి (విత్ డ్రా) తీసుకుంటామని న్యాయస్థానానికి తెలిపారు.

**నలిగిపోతున్న విద్యార్థులు.. కోర్టును ఆశ్రయించిన బాధితులు**
ఈ వివాదంలో తాము కూడా భాగసామ్యులవుతామంటూ (ఇంప్లీడ్) పలువురు విద్యార్థులు కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. విద్యార్థుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అటు ప్రభుత్వం, ఇటు కాలేజీ యాజమాన్యాల మధ్య అసలు తప్పు లేని విద్యార్థులు నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే బకాయిల ఆలస్యం కారణంగా ప్రస్తుతం 2, 3, 4వ సంవత్సరాలు చదువుతున్న విద్యార్థులు నష్టపోకుండా చూడాలని కోరారు. అలాగే ప్రభుత్వ నిబంధనలు లేదా ఉత్తర్వులు ఏవైనా ఉంటే, అవి ఈ ఏడాది కొత్తగా జాయిన్ అయ్యే విద్యార్థులకే వర్తించేలా చూడాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఈ కేసులో తదుపరి వాదనలను మంగళవారం అడ్వకేట్ జనరల్ స్వయంగా వినిపిస్తారని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలపడంతో, హైకోర్టు తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

## పరిష్కారమే కావాలి

**మునీరాబాద్ :** తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పనులు చరిత్రలో నిలుస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు వలసల గురించి తనకు అవగాహన ఉందని తెలిపారు. మూడు రాష్ట్రాల కరువు జిల్లాలకు ఇది పరిష్కారం చూపబోతోందని పేర్కొన్నారు. ఈరోజు(గురువారం) తుంగభద్ర డ్యాం కొత్త స్పిల్ వే గేట్లు ప్రారంభించారు. కర్ణాటక కొప్పల్ జిల్లా మునీరాబాద్ బహిరంగ సభలో సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు, డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసు అని చెప్పుకొచ్చారు.

**కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు చంద్రబాబు..**
మనందరి కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు చంద్రబాబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయని తెలిపారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోవడంతో నీరు సముద్రం పాలవుతోందని చెప్పారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని అన్నారు. తుంగభద్ర నుంచి 10 టీఎంసీల నీరు తమకు రావడం లేదని చెప్పారు. RDS కింద రైతులకు న్యాయం జరగాలని తాము ఆశిస్తున్నామని అన్నారు. చరిత్రలో ఈరోజు సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుందని తెలిపారు. తమకు పంచాయితీలు వద్దని.. పరిష్కారం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**రైతుల సమస్యకు తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పరిష్కారం..**
రాయలసీమ, తెలంగాణలోని లక్షలాదిమంది రైతుల సమస్యకు తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పరిష్కారం చూపుతుందని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నీటి సమస్యను పరిష్కరించకపోవడంతోనే పాలమూరు వాసులు వలసలు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. నీటి సమస్యలు ఓ కొలిక్కి వచ్చాయని.. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేంద్ర జలశక్తి మంత్రితో చర్చించామని తెలిపారు. తుంగభద్రలో పూడికతీతకు సంబంధించిన వ్యవహారంపై కేంద్రమంత్రితో చర్చించామని అన్నారు. తుంగభద్ర నది ఒడ్డున జరిగిన చర్చలు అంతరాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతాయని తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నీటి సమస్యను కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పుకొచ్చారు. ఆయన ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తారనే నమ్మకం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**6 నెలల్లో 33 గేట్ల పునరుద్ధరణ: సీఎం చంద్రబాబు**
రాయలసీమలోని పలు ప్రాంతాలకు సాగునీరు.. మరికొన్ని ప్రాంతాలకు తాగునీరు ఇస్తున్న ప్రాజెక్ట్ తుంగభద్ర అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దేశంలో నదుల అనుసంధానం తన కలల ప్రాజెక్ట్ అని ఉద్ఘాటించారు. గంగా, గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరగాలని పేర్కొన్నారు. తుంగభద్ర డ్యామ్ 70 ఏళ్ల చరిత్ర ఉన్న ప్రాజెక్ట్ అని తెలిపారు. తుంగభద్ర తల్లికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా.. అందరూ రైతులకూ నమస్కారాలు అంటూ సీఎం చంద్రబాబు కన్నడలో ప్రసంగించారు. ప్రాజెక్ట్ నిర్వహణ బాగుంటేనే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతోందని చెప్పారు. 6 నెలల్లో 33 గేట్ల పునరుద్ధరణ జరిగిందని వివరించారు. తమిళనాడుకు నీళ్లు ఇవ్వాలని 1983లో నిర్ణయం తీసుకున్నామని చెప్పుకొచ్చారు. నీటి సమస్యల పరిష్కారానికి కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఇవాళ ముగ్గురు సీఎంలు కలవడం చరిత్రాత్మకమని చెప్పుకొచ్చారు. ఎల్‌నినో వల్ల కొన్ని ప్రాంతాల్లో కరవు సమస్య ఉందని తెలిపారు. నీరు ఉంటేనే చరిత్ర, నాగరికత అని.. ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని అభివర్ణించారు.

**ముగ్గురం కలిసి చరిత్ర సృష్టిస్తాం: డీకే శివకుమార్**
కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో చారిత్రాత్మక తీర్మానం చేశామని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. మూడు రాష్ట్రాల రైతుల కోసం తీసుకున్న నిర్ణయం ఓ చరిత్ర అని తెలిపారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, తాను చరిత్ర సృష్టిస్తామని చెప్పారు. అందరం కలిసి సమన్వయంతో పనిచేస్తామని అన్నారు. మూడు రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేస్తామని సీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు.

## ప్రభుత్వం, చట్టం ఏమి చెబుతోంది?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వానికి ప్రూఫ్ కాదని కేంద్రం చేసిన ప్రకటన దేశంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రకటనపై విపక్షాలు, ఇతర వర్గాల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో కేంద్రం గురువారం మరో ప్రకటన చేసింది. పాస్‌పోర్ట్ పౌరసత్వానికి రుజువు కాదని తీసుకున్న నిర్ణయం నిన్నటికి నిన్న తీసుకున్నది కాదని చాలా దశాబ్దాలుగా చట్టపరంగా ఇదే స్థితి కొనసాగుతోందని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇస్తూ 'పాస్‌పోర్ట్ చట్టం, 1967' లోని సెక్షన్ 20ని ఉదహరించింది. సెక్షన్ 20 ప్రకారం పౌరులు కాని వారికి కూడా కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్ట్ లేదా ప్రయాణ పత్రాలను జారీ చేయవచ్చని చట్టంలోనే ఈ నిబంధన ఉండటం వల్ల, కేవలం పాస్‌పోర్ట్ ఉన్నంత మాత్రాన ఒక వ్యక్తిని భారత పౌరుడిగా ఖరారు చేయలేమని ప్రభుత్వం వివరించింది. అలాగే పాస్‌పోర్ట్ కలిగి ఉండటం పౌరసత్వాన్ని నిరూపించదని 2013 నాటి బాంబే హైకోర్టు తీర్పు కూడా స్పష్టం చేసిందని కేంద్రం గుర్తుచేసింది.

**ప్రతిపక్షాల విమర్శలు..**
పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన వివరణాత్మక సమావేశంలో పాస్‌పోర్ట్ అనేది ప్రధానంగా ఒక ప్రయాణ పత్రం మాత్రమేనని, దానిని పౌరసత్వానికి రుజువుగా పరిగణించరాదని చేసిన ప్రకటన రాజకీయ దుమారం రేపింది. దీనిపై విపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు చేయగా పలువురు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నలు కురిపిస్తున్నారు. ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఓటర్ కార్డు ఇలా ప్రభుత్వం జారీ చేసినవేవి సిటిజన్ షిప్ నిరూపించేందుకు ప్రామాణికం కాదని గతంలో చెప్పగా అదే దారిలో ఇప్పుడు పాస్ పోర్టు కూడా చేరిపోయిందని మరి ఈ దేశంలో పౌరసత్వానికి రుజువు మరేంటని? ప్రశ్నిస్తున్నారు. ఆదిత్య థాక్రే, కపిల్ సిబల్, జర్నలిస్ట్ రాజ్ దీప్ సర్దేశాయ్, కవి జావీద్ అక్తర్ వంటి వారు ప్రభుత్వ ప్రకటనపై విమర్శలు గుప్పించారు.

**ఇది కొత్త పాలసీ కాదు: బీజేపీ**
విపక్షాల విమర్శలపై బీజేపీ నేత అమిత్ మాలవీయ స్పందిస్తూ విదేశాంగ శాఖ ఎలాంటి కొత్త విధానాన్ని ప్రకటించలేదని, కేవలం చట్టపరంగా ఉన్న పాత నిబంధననే పునరుద్ఘాటించిందని చెప్పారు.భారతదేశంలో పౌరసత్వాన్ని కేవలం ఒకే ఒక్క పత్రం ఆధారంగా కాకుండా.. 'పౌరసత్వ చట్టం, 1955' ప్రకారం నిర్ధారిస్తారని ఆయన పేర్కొన్నారు. బర్త్ సర్టిఫికెట్లు, తల్లిదండ్రుల పౌరసత్వ రికార్డులు, స్కూల్ సర్టిఫికెట్లు, ఓటర్ లిస్ట్ ఎంట్రీలు, ల్యాండ్ రికార్డులు మరియు పాస్‌పోర్ట్ వంటి వివిధ ప్రభుత్వ అధికారిక పత్రాల కలయిక ద్వారానే పౌరసత్వం స్థాపించబడుతుందని వివరించారు. అయితే రాజకీయంగా రేగిన ఈ పౌరసత్వం వివాదం ఏ మలుపు తిరుగుతుందో చూడాలి.

## ప్రజల ప్రాణాలతో చెలగాటం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలోని ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లలో నాణ్యత లేని వంటశాలలు బయటపడుతున్నాయి. తాజాగా కొండాపూర్‌లోని 'జాయకా ఫుడ్ కోర్ట్' లో షాకింగ్ నిజాలు వెలుగుచూశాయి. ఈ ఫుడ్ కోర్టులో ఎలుకలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయంటూ ఓ కస్టమర్ వీడియో తీసి అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు మెరుపు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. రెస్టారెంట్‌లో ఎలుకలు విచ్చలవిడిగా తిరుగుతూ ఆహార పదార్థాల ప్యాకెట్లను కొరికేసినట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా ఫుడ్ ఐటమ్స్, ప్యాకేజింగ్ మెటీరియల్స్ స్టోర్ చేసే ప్రాంతాల్లో ఎలుకల విసర్జనలు పడి ఉండటాన్ని గమనించారు. వీటికి తోడు, అస్సలు పనిచేయని ఓ ఫ్రీజర్‌లో కుళ్లిపోయిన కూరగాయలు, పాడైపోయిన చికెన్ బిర్యానీని నిల్వ ఉంచినట్లు అధికారులు కనుగొన్నారు. కిచెన్ పరిసరాలన్నీ తీవ్ర అపరిశుభ్రంగా మారడమే కాకుండా, కనీస నిబంధనలైన ఉద్యోగుల మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, రెస్టారెంట్ పెస్ట్ కంట్రోల్ రికార్డులు ఏవీ యాజమాన్యం వద్ద అందుబాటులో లేవు. ఈ స్థాయిలో ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటూ తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడినందుకు గానూ ఫుడ్ సేఫ్టీ అధికారులు జాయకా ఫుడ్ కోర్ట్ ఫుడ్ లైసెన్స్‌ను తక్షణమే సస్పెండ్ చేశారు. అనంతరం ఆ ఫుడ్ కోర్టును పూర్తిగా సీజ్ చేశారు. నగరంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న తనిఖీల్లో ప్రముఖ రెస్టారెంట్ల అసలు రంగు బయటపడుతుండటంతో నగరవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నగరంలో నాణ్యత కొరత..**
ఇక, నగరవాసులకు బిర్యానీ అంటే కేవలం ఆహారం కాదు, అదొక ఎమోషన్. కానీ గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని ప్రముఖ హోటళ్లు, పేరున్న రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు జరుపుతున్న తనిఖీలు చూస్తుంటే.. మనం తినేది ఆహారమా లేక రోగాలా? అనే భయం పట్టుకుంటోంది. తిండి ప్రియులకు ఈ నిజాలు నిజంగానే విస్తుగొలుపుతున్నాయి. టాస్క్‌ఫోర్స్ అధికారులు నగరంలోని ఐటీ కారిడార్ నుంచి పాతబస్తీ వరకు జరిపిన మెరుపు దాడుల్లో దిగ్భ్రాంతికరమైన విషయాలు బయటపడ్డాయి. చికెన్, మటన్ ముక్కలు కుళ్ళిపోయి, బూజు పట్టినా సరే.. వాటికి రంగులు, మసాలాలు దట్టించి కస్టమర్ల ప్లేట్లలోకి నెట్టేస్తున్నారు. చికెన్ 65, కబాబ్స్ వంటి వంటకాలు చూడగానే నోరూరుంచేలా చేయడానికి క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదకరమైన సింథటిక్ రంగులను విచ్చలవిడిగా వాడుతున్నారు. ఇక కిచెన్‌లలో ఈగలు, బొద్దింకలు, ఎలుకలు స్వైరవిహారం చేస్తున్నాయి. డ్రైనేజీ పైపుల పక్కనే వంటకాలను సిద్ధం చేయడం, కనీసం చేతులకు గ్లౌజ్స్ లేకుండా వండడం, వాడిన నూనెనే మళ్లీ మళ్లీ మరిగిస్తూ వాడడం సర్వసాధారణమైపోయింది.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# నీటి వాటాకు సీఎం తూట్లు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తుంగభద్రలో మన నీటి వాటాకు తూట్లు పొడిచే పనికి ముఖ్యమంత్రి రేవంత్ మద్దతు ఇస్తున్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఆర్డీఎస్ చుట్టు కర్ణాటక చేపట్టే ప్రాజెక్ట్ లతో మనం నీటి హక్కును కోల్పోతామని మన హక్కులను కాపాడాల్సిన ముఖ్యమంత్రి కర్ణాటక దోపిడీకి వంత పాడుతున్నారని ఆరోపించారు. ఆర్డీఎస్ మీద నిర్మించి ప్రాజెక్ట్ ల ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి వెళ్లవద్దన్నారు. అందుకు బదులుగా సెంట్రల్ వాటర్ కమిషన్ వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లి పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం జిల్లాలకు అన్యాయం చేయవద్దన్నారు.

**నాడు కేసీఆర్ నేడు రేవంత్:**

తెలంగాణ సాధించుకొని 12 ఏళ్లు గడిచిన తర్వాత కూడా మనం పూర్తిస్థాయిలో కృష్ణా, తుంగభద్రలో మన నీటిని వాడుకోలేదని, ఆర్డీఎస్ ప్రాజెక్ట్ నడిగడ్డను బతికించి...ఉమ్మడి మహబూబ్ నగర్‌కు ఉపయోగపడే ప్రాజెక్ట్ అన్నారు. ఆర్డీఎస్‌లో మనకు 16 టీఎంసీల వాటా ఉంటే ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ వచ్చిన తర్వాత కానీ 6 టీఎంసీల కన్నా ఎక్కువ వాడుకోలేదన్నారు. మన నీటిని పూర్తిస్థాయిలో వాడుకునేందుకు ఆర్డీఎస్ చుట్టుపక్కల రిజర్వాయర్లను బలోపేతం చేయాల్సి ఉంది. కానీ దురదృష్టవశాత్తు ఆనాడు కేసీఆర్, ఇప్పుడు రేవంత్ సర్కార్ దాన్ని పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. దీంతో నడిగడ్డకు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతూనే ఉందని ఆరోపించారు. మనకు ఆర్డీఎస్‌లో 16 టీఎంసీలు వచ్చినట్లే ఏపీకి సుంకేశుల నుంచి 16 టీఎంసీల వాటా ఉంది. కానీ వాళ్లు దాన్ని 32 టీఎంసీలు చేసుకోని బీభత్సంగా నీటిని వాడుకుంటున్నారు. మనం మాత్రం ఆ పనిచేయలేదు. మనం మౌలిక సదుపాయాలు ప్రాజెక్ట్ లు కట్టుకునే లోపే కర్ణాటక తుంగభద్ర మీద మూడు ప్రాజెక్ట్ లు కడుతోంది. కురిడి, కల్వగల్ గ్రామాల్లో 2 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లు నిర్మిస్తోంది. ఆర్డీఎస్ కు 15 కి.మీ.ల ఎగువన చిక్కాలపర్వి వద్ద 2.50 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో బ్యారేజ్ నిర్మిస్తోంది. ఆర్డీఎస్‌కు దిగువన రాయచూరు జిల్లాలోని చిక్క మంచాల సమీపంలో 5 టీఎంసీల కెపాసిటీతో మరో బ్యారేజి నిర్మిస్తోందన్నారు. మొత్తంగా ఆర్డీఎస్ కు ఎగువన, దిగువ 10 టీఎంసీల నీటిని వినియోగించుకునేలా కర్ణాటక ప్రాజెక్టులు చేపడుతోందన్నారు.

**శాశ్వతంగా మన హక్కులు కోల్పోయే ప్రమాదం:**

వాస్తవానికి కర్ణాటకకు ఆర్డీఎస్ లో 1.20 వాటా నీళ్లు మాత్రమే ఉన్నాయని కానీ పది టీఎంసీల నీళ్లు వినియోగించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. అలాంటి కార్యక్రమానికి మన సీఎం రేవంత్ రెడ్డి వెళ్లి చంద్రబాబు, డీకే శివకుమార్‌లను కూర్చొబెట్టుకోని మనకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కర్ణాటక ఈ ప్రాజెక్ట్ లను పూర్తి చేస్తే తుంగభద్రలో మన వాటా హక్కును పర్మినెంట్‌గా కోల్పోతామన్నారు. అందుకే ఈ కార్యక్రమానికి రేవంత్ రెడ్డి వెళ్లొద్దు. బదులుగా ప్రొటెస్ట్ రూపంలో ఒక లేఖ రాయాలని సూచించారు. మళ్లీ మీరు అధికారంలోకి రారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశంపై చర్యలు తీసుకుంటే మీ ముఖ్యమంత్రే మా ప్రాజెక్ట్ లకు అంగీకారం తెలిపారని కర్ణాటక వాదిస్తుందన్నారు.

**ఏపీ, కర్ణాటక సీఎంలతో ఆ మాట చెప్పించండి:**

మీరు చేసే ఈ పని నడిగడ్డ ప్రజలకు అతిపెద్ద గుదిబండగా మారుతుందని అందుకే సెంట్రల్ వాటర్ కమిషన్ దగ్గరకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. అందరం కలిసి కేంద్రంతో మన నీటి వాటా హక్కుల కోసం పోరాడుదామని కృష్ణా, తుంగభద్రలో మన వాటాను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి శాశ్వతంగా తాగు, సాగు నీరు వచ్చేలా చేసుకుందామని, ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం జిల్లాను కాపాడుకోవాలంటే మీరు ఆ కార్యక్రమానికి వెళ్లవద్దన్నారు. ఒకవేళ వెళితే అదే స్టేజీ మీద బనకచర్ల కట్టమని ఏపీ సీఎంతో, ఈ మూడు ప్రాజెక్ట్ లు రద్దు చేసుకుంటామని కర్ణాటక ముఖ్యమంత్రితో చెప్పించాలన్నారు. అంతేగానీ తెలంగాణ నీటి హక్కును కోల్పోయే ప్రమాదకరమైన పనికి మద్దతివ్వొద్దన్నారు.

# జనం కోసం పనిచేసే వారే సమాజానికి ఆదర్శం

**కోదాడ,ఫ్లాష్ ఇండియా :** కోదాడ పట్టణంలోని దుర్గాపురం వై జంక్షన్ వద్ద కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు గురువారం ఘనంగా ప్రారంభించారు. కోదాడకు చేరుకున్న ఆయనకు సమితి నాయకులు, సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సభా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, తాను పదవి విరమణ చేశానే గానీ పెదవి విరమణ చేయలేదని వ్యాఖ్యానించి సభికులను ఆకట్టుకున్నారు. తాను సంపాదించిన జ్ఞానాన్ని యువతరానికి అందించేందుకు దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నానని తెలిపారు. మంచి పనులు చేయడం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. “సర్వేజనాః సుఖినో భవంతు” అనే భావనతో సమాజం వసుధైక కుటుంబంగా ఉండాలని ఆకాంక్షించారు. సంపదకు మనం ధర్మకర్తలమని, ప్రతిఫలాపేక్ష లేకుండా చేసే పనినే ధర్మమని పేర్కొన్నారు. ఇష్టపడి, కష్టపడి పని చేస్తే ఎవరూ నష్టపోరని యతి ప్రాసలతో ప్రసంగాన్ని రంజింపజేశారు. ఆవు, చెట్టు పరులకు ఉపకారం కోసం జీవిస్తాయని, మనుషులు కూడా సేవా భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రకృతిని ప్రేమించి కాపాడాలని, ప్రస్తుతం ప్రకృతి పరితపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. “నేచర్ అండ్ కల్చర్ ఫర్ ఎ బ్రైట్ ఫ్యూచర్” అనే సందేశాన్ని అందించారు. కులం ఉండవచ్చని, కానీ కులపిచ్చి ఉండకూడదని స్పష్టం చేశారు. సేవా భావంతో అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తాను న్యాయవాదిగా మారాలనుకున్నప్పటికీ, అత్యవసర పరిస్థితుల ప్రభావంతో రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. తన బాల్య జీవితంలోని పలు సంఘటనలను సభికులతో పంచుకున్నారు. రాజకీయాల్లో ఉన్నవారు తక్కువ మాట్లాడి ఎక్కువ పని చేయాలని వెంకయ్య నాయుడు చేసిన సూచనలను ప్రస్తావిస్తూ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ కోవకు చెందిన నాయకుడని వెంకయ్య నాయుడు ప్రశంసించారు. కళ్యాణ మండప నిర్మాణానికి భూరి విరాళాలు అందించిన దాతలను అభినందించిన ఆయన, సమాజ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రతి ఒక్కరినీ ప్రశంసించారు.

కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాకతీయ కమ్మ సేవా సమితి బాధ్యులు, దాతలు, ప్రముఖులు, సభ్యులు, వివిధ రంగాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అనంతరం సేవ సమితి ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన విద్యార్థులకు మాజీ ఉప రాష్ట్ర పతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, మాజీ మంత్రి వీరేపల్లి లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్రావు, మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ, మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, రావెళ్ళ సీతారామయ్య, సంఘం కోదాడ అధ్యక్షులు పెదనాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వేమూరి సురేష్, కోశాధికారి పోటు రంగారావు, ఉపాధ్యక్షులు మార్తి మాధవరావు, సంయుక్త కార్యదర్శి కనగాల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాత మధు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మెల్సీ తొండాపూ దశరథ జనార్దన్ రావు, మాజీ ఎమ్మెల్యే కోటేశ్వరరావు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, కమ్మ సేవా సంఘాల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు బొడ్డు రవిశంకర్, కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి రత్నాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో జనసేన దూకుడు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఏపీ, తెలంగాణ వివాదాల నేపథ్యంలో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్రంలో స్పీడ్ పెంచింది. జనసేన పార్టీని సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడం, ప్రజల సమస్యలపై పార్టీ భవిష్యత్ కార్యాచరణను బలోపేతం చేయడమే లక్ష్యంగా కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా జూన్ 28 నుంచి జూలై 7, 2026 వరకు రాష్ట్రవ్యాప్తంగా పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాలను నిర్వహించనున్నారు. ప్రతిరోజూ రెండు విడతలుగా (ఉదయం 10:30 గంటలకు – సాయంత్రం 3:00 గంటలకు) ఈ సమావేశాలు జరగనున్నాయి. జూన్ 28న సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి ప్రాంతాలతో ప్రారంభమై.. జూలై 7న నిజామాబాద్, భువనగిరి నియోజకవర్గాల సమావేశాలతో ఈ షెడ్యూల్ ముగియనుంది. ఈ పది రోజుల పాటు జరిగే విస్తృత స్థాయి సమావేశాలలో వరంగల్, ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్, మెదక్, కరీంనగర్, మహబూబ్‌నగర్ సహా అన్ని ప్రధాన పార్లమెంట్ స్థానాల పరిధిలోని స్థితిగతులపై పార్టీ అధిష్టానం సమీక్షించనుంది. పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు అందరూ పరస్పర సమన్వయంతో ఈ సమావేశాలలో పాల్గొని విజయవంతం చేయాలని జనసేన పార్టీ పిలుపునిచ్చింది. స్థానిక ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాడేందుకు, పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపేందుకు ఈ సమావేశాలు దిశానిర్దేశం చేస్తాయని పార్టీ శ్రేణులు, రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# చింతబరిగె ఇరుగుద్ది..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రెగ్యులర్ ఉద్యోగులు సహా.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు కూడా ఉచిత బీమా కల్పించేలా సీఎం రేవంత్ రెడ్డి 14 బ్యాంకులతో MoU కుదుర్చుకుని, ఉద్యోగులు, పెన్షనర్ల ప్రమాద బీమా పథకానికి శ్రీకారం చుట్టారు. రవీంద్రభారతిలో ఆయా MoUలపై సీఎం సంతకాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంస్థ లేదా ప్రభుత్వం కోసం కష్టపడేవారికి అండగా ఉండాల్సిన బాధ్యత యజమానిదేనన్నారు. దీనిని ఉద్యోగులు అడగకపోయినా ప్రభుత్వమే ఒకడుగు ముందుకు వేసిందన్నారు. ఉద్యోగులందరికీ ఇన్సూరెన్స్ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా ఉద్యోగులు ఇన్సూరెన్స్ ప్రయోజనాలు పొందేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రమాద బీమా ద్వారా ఉద్యోగులకు రూ.కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకూ కవరేజి ఉంటుందని, విమాన ప్రమాదబీమాకు బ్యాంకులు రూ.2కోట్లు – రూ.3 కోట్లు బీమాను అందిస్తున్నాయని వివరించారు. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్న ఉద్యోగులందరికీ సీఎం ధన్యవాదాలు తెలిపారు.

**నేను గుంపు మేస్త్రీనే..**

తాను గుంపు మేస్త్రీనే అని, మా మంత్రుల గుంపుకంతా మేస్త్రీనే అని.. ఎవరు అవహేళన చేసినా పట్టించుకోనని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తన గుంపులో ఉన్నవారంతా రాష్ట్రం కోసం ఎంతో కష్టపడుతున్నారన్నారు. తాను మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చినవాడినేనని, ఆయ కుటుంబాల్లో కష్టాలెలా ఉంటాయో తెలుసన్నారు. హోదా, పదవులు మారినా, ప్రజలతో తనకున్న అనుబంధం మాత్రం మారదన్నారు. ఆనాడైనా, ఈనాడైనా తనను రేవంతన్న అని పిలిస్తేనే ఇష్టమని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఒక గంట అదనంగా పనిచేద్దామని ఉద్యోగులను సీఎం కోరారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేలా పనిచేస్తే.. ఆ ఆదాయాన్ని ఉద్యోగుల కోసమే ఉపయోగిస్తామన్నారు. గత ప్రభుత్వం ఒకటోతారీఖు కాదుకదా.. పదోతేదీ వచ్చినా జీతాలివ్వలేని పరిస్థితి కల్పించిందని, కాంగ్రెస్ సర్కార్ వచ్చాక ఉద్యోగులకు ఫస్ట్ తేదీనే జీతాలిస్తున్నామని తెలిపారు.

**చింతబరిగె ఇరుగుద్ది..**

ఇక ఉద్యోగులకు పీఆర్సీ విషయంలో ఇచ్చిన మాటను కూడా నిలబెట్టుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. ఉద్యోగుల నమ్మకమే ప్రభుత్వానికి కొండంతబలమన్నారు. ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారినా.. ఉద్యోగులు మాత్రం శాశ్వతంగా ఉంటారన్నారు. ప్రభుత్వానికి ఉద్యోగులే వారధులు, సారథులుగా ఉంటారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వచ్చాక 70 వేల ఉద్యోగులు ఇచ్చామని గుర్తుచేశారు. గంగా, కావేరి, కృష్ణ వంటి నదుల పేర్లను ఆడబిడ్డలకు పెడుతున్నారని, మూసీనది పేరు ఎందుకు పెట్టడంలేదో ఎప్పుడైనా ఆలోచించారా? అని సీఎం ప్రశ్నించారు. మూసీ అంటేనే కాలుష్యానికి మారు పేరుగా మారిందని, దానిని ప్రక్షాళన చేసేందుకు కాలికి కట్టె కట్టుకుని తిరుగుతుంటే.. ప్రతిపక్షాలు బురద జల్లుతున్నాయని వాపోయారు. ఇక నగరం విస్తరించినపుడు మెట్రోకూడా విస్తరించాలని ప్రయత్నిస్తోంటే.. ఇప్పుడు వద్దని అడ్డం పడుతున్నారని దుయ్యబట్టారు. ఇలా ప్రతిదానికి అడ్డుపడితే చింతబరిగె ఇరుగుతుందని సీఎం హెచ్చరించారు.

# రైతులెవరూ భయపడొద్దు..



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** జిల్లాలోని చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో ఈనెల 30న జరిగే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభా స్థలాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈరోజు(గురువారం) పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన కార్యక్రమం రైతు భరోసా అని చెప్పుకొచ్చారు. జులై నెలలోనే రైతులకు రైతుభరోసా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని రైతులందరికీ కలిపి రైతు భరోసా కింద రూ.9 వేల కోట్లను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారన్నారు. ఈ సభకు రైతు ఆశీర్వాద సభగా రైతులే నామకరణం చేశారని తెలిపారు. భారత దేశంలో అత్యధికంగా పంటలు పండించిన రాష్ట్రం తెలంగాణ అని మంత్రి అన్నారు. వ్యవసాయ రంగంలో పంటమార్పిడి విధానంలో ఆయిల్ ఫాం సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో పది వేల ఎకరాలను రైతులు సాగు చేసే విధంగా సహకారం అందజేస్తున్నామని చెప్పారు. దేశంలో తెలంగాణలోనే అత్యధిక ఆయిల్ ఫాం సాగు జరుగుతోందన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని తెలిపారు. రెండేళ్లలో లక్ష కోట్లు రైతాంగానికి అందజేశామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేశామని అన్నారు. ఏడాదికి పది వేల కోట్లు నష్టం వచ్చినప్పటికీ కొనుగోలు చేస్తున్నామన్నారు. ఏడు రకాల వరి అందుబాటులో ఉందని రైతాంగానికి తుమ్మల తెలియజేశారు. వాతావరణ పరిస్థితులను బట్టి రైతులు పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా ఉంచుతున్నారని... నిల్వ చేసి అధిక ధరలకు అమ్మేందుకు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఎవరూ కూడా భయపడవద్దని.. అందరికీ యూరియా అందిస్తామని స్పష్టం చేశారు. యూరియా కోసం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చామని.. అందులో అన్ని వివరాలు ఉన్నాయన్నారు. యూరియా కోసం తెచ్చిన యాప్ దేశానికే ఆదర్శమని ప్రధాని మోదీ కూడా ప్రశంసించే పరిస్థితి ఉందన్నారు. రైతాంగం పాడి పంటపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. అత్యధికంగా పురుగుల మందులు వాడుతున్నారని ఇక్కడి పంటలను విదేశాలు రిజెక్ట్ చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం కష్టంలో ఉందని, నిధుల కొరత ఉందని అయినా రైతాంగానికి అండగా ఉండాలని అప్పుచేసి మరీ రైతుభరోసా ఇస్తున్నామని చెప్పారు. ఈనెల 28న రైతు ఎగ్జిబిషన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. 28, 29 రెండు రోజుల పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సభా ప్రాంగణంలో అందుబాటులో ఉంటారన్నారు. 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ జరుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# యువతకు వరంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్



**రాజాపూర్,ఫ్లాష్ ఇండియా :** రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడ గ్రామంలో గురువారం రూ.42 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించనున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణ పనులకు మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గ యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచే దిశగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంత యువతకు నాణ్యమైన నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు. రంగారెడ్డిగూడెంలో ఏటీసీ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు కావడం నియోజకవర్గానికి గర్వకారణమని, యువత ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యువత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ఇటువంటి శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. అనంతరం మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కలిసి శంకుస్థాపన చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల సంరక్షణకు ప్రాధాన్యతనివ్వాలి



**గద్వాల,ఫ్లాష్ ఇండియా :** బాలసదనంలోని చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సంబంధిత అధికారులు వారి సంరక్షణకు ప్రాధాన్యత నివ్వాలని మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓజా అన్నారు. గురువారం గద్వాలలో పర్యటించిన డైరెక్టర్ స్థానిక బాలసదనంను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, సమీపంలోని పాఠశాలల్లో విద్యాబోధనకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా బాల సదనంలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. వివిధ రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. పలువురు చిన్నారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు బాగా చదువుకోవాలని సూచించారు. బాల సదనాన్ని వారంలో ఒకసారి పర్యవేక్షణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం అధికారులు గద్వాలలోని సఖి కేంద్రమును సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శృతి ఓజా మాట్లాడుతూ సఖి కేంద్రం సేవలను గురించి ప్రజలకు అవగాహన కలిగేలా పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలన్నారు. బాధిత మహిళలు, చిన్నారులకు కౌన్సిలింగ్ నిర్వహించి తగు సూచనలు చేయాలన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ఐటీ, స్టోర్, సర్వైవర్, తదితర విభాగాలను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది వివరాలను అడిగారు. సమీపంలో నూతనంగా నిర్మించిన బాలసదనం భవనాన్ని పరిశీలించి మిగిలి ఉన్న పనులను పూర్తిచేసి ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఈ పర్యటనలో డిడబ్ల్యుఓ సునంద, డీసీపీఓ నరసింహ, సీడీపీఓలు రాజేశ్వరి, హేమలత, ఆకాశ దీప్తి, బాలసదనం పర్యవేక్షకులు వెంకటేశ్వరి, సఖి కేంద్రం సీఏ అరుణ, తదితరులున్నారు.

# సంపాదకీయం

## కేంద్ర కేబినెట్‌లో చోటెవరిది?



కేంద్ర మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన ఊహాగానాలు ఢిల్లీ రాజకీయ వర్గాల్లో మొదలైతే, రాష్ట్ర రాజకీయాల్లోనూ చర్చలు ఊపందుకోవడం సహజం. అయితే ఈసారి తెలంగాణ బీజేపీలో కనిపిస్తున్న పోటీ కేవలం మంత్రి పదవుల కోసం జరిగే సాధారణ రాజకీయ వ్యాయామంగా కనిపించడం లేదు. ఇది పార్టీ అంతర్గత సమీకరణాలు, సామాజిక వర్గాల ప్రాతినిధ్యం, భవిష్యత్ ఎన్నికల వ్యూహాలు, రాష్ట్రంలో బీజేపీ విస్తరణ లక్ష్యాలతో ముడిపడిన అంశంగా మారింది. అందుకే రాబోయే కేబినెట్ విస్తరణలో ఎవరికి పదవి దక్కుతుందన్న ఆసక్తికంటే, తెలంగాణకు కేంద్ర నాయకత్వం ఎలాంటి రాజకీయ సంకేతం ఇవ్వబోతోందన్న ప్రశ్నే మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు లోక్‌సభలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారిలో ఇప్పటికే కేంద్ర కేబినెట్‌లో కిషన్ రెడ్డి కేబినెట్ మంత్రిగా, బండి సంజయ్ సహాయ మంత్రిగా ఉన్నారు. అయినప్పటికీ రాష్ట్రంలో పార్టీ రాజకీయంగా మరింత బలోపేతం కావాలంటే, విభిన్న సామాజిక వర్గాలకు, ప్రాంతాలకు ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని బీజేపీ అధిష్టానం భావించే అవకాశం ఉంది. అందువల్ల ఈసారి తెలంగాణకు మరో మంత్రి పదవి దక్కవచ్చున్న ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. మంత్రి పదవుల కోసం ఆశావహుల జాబితా కూడా చిన్నది కాదు. ఈటల రాజేందర్, డీకే అరుణ, అర్వింద్ ధర్మపురి, గోడం నగేశ్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరిలో ప్రతి ఒక్కరూ తమకు అవకాశం వస్తుందని ఆశిస్తున్నారు. ఆ ఆశలకు రాజకీయ కారణాలూ ఉన్నాయి. సామాజిక సమీకరణాల లెక్కలూ ఉన్నాయి. పార్టీకి చేసిన సేవల ప్రస్తావనలూ ఉన్నాయి. అయితే కేంద్ర మంత్రివర్గంలో చోటు సంపాదించడం అనేది కేవలం వ్యక్తిగత అర్హతల ఆధారంగా జరిగే వ్యవహారం కాదు. కేంద్ర రాజకీయాల గణితం, రాబోయే ఎన్నికల అవసరాలు, ప్రాంతీయ సమతుల్యత, సామాజిక వర్గాల ప్రాతినిధ్యం, జాతీయ వ్యూహాలు అన్నీ కలిసి ఆ నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. తెలంగాణ రాజకీయాల ప్రత్యేకత ఏమిటంటే ఇక్కడ కుల, సామాజిక సమీకరణాలు ఎన్నికల ఫలితాలపై గణనీయమైన ప్రభావం చూపుతాయి. బీసీలు, ఎస్టీలు, మహిళలు, ఇతర వెనుకబడిన వర్గాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా బీజేపీ తెలంగాణలో తన రాజకీయ పునాదిని విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది. అయితే ఇంకా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా సమాన స్థాయిలో బలపడలేదనే వాస్తవం ఉంది. అందుకే కేబినెట్ విస్తరణను కేవలం పదవుల పంపిణీగా కాకుండా, తెలంగాణలో బీజేపీ తన సామాజిక వ్యూహాన్ని అమలు చేసే అవకాశంగా కూడా చూడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో బీసీ వర్గానికి చెందిన నేతకు మంత్రి పదవి ఇస్తే అది ఒక స్పష్టమైన రాజకీయ సందేశంగా మారుతుంది. ఎందుకంటే తెలంగాణలో బీసీ వర్గాల రాజకీయ చైతన్యం నిరంతరం పెరుగుతోంది. ఇదే సమయంలో మహిళా నాయకత్వానికి ప్రాధాన్యం ఇస్తే, అది కూడా పార్టీ విస్తరణకు ఉపయోగపడే అవకాశం ఉంది. అలాగే ఆదివాసీ వర్గానికి చెందిన నాయకుడికి అవకాశం కల్పిస్తే, ఉత్తర తెలంగాణలో బీజేపీ తన ప్రభావాన్ని మరింత పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నదన్న సంకేతం వెళ్తుంది. ఈటల రాజేందర్ పేరు చర్చలో ఎక్కువగా వినిపించడం వెనుక రాజకీయ నేపథ్యం ఉంది. బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన తర్వాత ఆయనను రాష్ట్ర స్థాయిలో ప్రముఖ నాయకుడిగా ప్రొజెక్ట్ చేసింది పార్టీ. ఇటీవల రాష్ట్ర అధ్యక్ష పదవి రాకపోయినప్పటికీ, ఆయనకు కేంద్ర స్థాయిలో ప్రాధాన్యం కల్పించే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం కొనసాగుతోంది. మరోవైపు డీకే అరుణ కూడా పార్టీకి దీర్ఘకాలంగా సేవలందించిన మహిళా నాయకురాలు. ఆమెకు అవకాశం ఇవ్వడం ద్వారా మహిళా ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేసినట్టవుతుంది. గోడం నగేశ్‌కు అవకాశం లభిస్తే ఆదివాసీ వర్గాలకు బీజేపీ చేరువ కావాలనుకుంటోందన్న సందేశం వెళ్తుంది. అర్వింద్‌కు అవకాశం కల్పిస్తే బీసీ సమీకరణాలకు ప్రాధాన్యం ఇచ్చినట్టవుతుంది. అయితే ఈ మొత్తం చర్చలో ఒక ముఖ్యమైన అంశం మరుగున పడుతోంది. అది రాష్ట్ర ప్రయోజనాల అంశం. తెలంగాణకు ఎన్ని మంత్రి పదవులు వచ్చాయన్నది ఒక కోణం మాత్రమే. కానీ ఆ పదవులు రాష్ట్రానికి ఎంత ఉపయోగపడుతున్నాయన్నదే అసలు ప్రశ్న. కేంద్రంలో మంత్రి పదవులు పొందిన వారు రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో, పరిశ్రమల పెట్టుబడుల సాధనలో, జాతీయ ప్రాజెక్టుల అమలులో ఎంత చొరవ చూపుతున్నారు? అనే అంశాలే ప్రజలకు ముఖ్యమైనవి. మంత్రి పదవి అనేది కేవలం రాజకీయ గౌరవానికి చిహ్నం కాదు. అది బాధ్యత కూడా. ఇటీవలి కాలంలో రాష్ట్రాలు కేంద్రంలో తమ ప్రాతినిధ్యాన్ని అభివృద్ధి సాధనంగా ఉపయోగించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కేంద్ర మంత్రుల ప్రభావం అభివృద్ధి కార్యక్రమాల్లో స్పష్టంగా కనిపిస్తుంటుంది. తెలంగాణ విషయంలో కూడా ప్రజలు అదే ఆశిస్తున్నారు. కేంద్రంలో ఎవరు మంత్రి అయ్యారన్నది కంటే, తెలంగాణకు ఏమి సాధించారన్నదే భవిష్యత్ రాజకీయ మూల్యాంకనానికి ప్రమాణంగా మారనుంది. ఇక కిషన్ రెడ్డి భవిష్యత్ పాత్రపై వస్తున్న ప్రచారం కూడా ఆసక్తికరంగానే ఉంది. ఆయనకు మరింత కీలకమైన శాఖ అప్పగిస్తారన్న ఊహాగానాలు ఒకవైపు వినిపిస్తుండగా, మరోవైపు దక్షిణ భారతంలో పార్టీ విస్తరణ కోసం సంస్థాగత బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందన్న వార్తలు కూడా వస్తున్నాయి. ఒకవేళ అలాంటి నిర్ణయం తీసుకుంటే అది బీజేపీ దక్షిణాది వ్యూహంలో తెలంగాణకు ఉన్న ప్రాధాన్యాన్ని సూచించే అవకాశముంది. ఎందుకంటే దక్షిణ భారతంలో పార్టీ విస్తరణ ఇప్పటికీ బీజేపీకి అత్యంత కీలక రాజకీయ లక్ష్యంగా ఉంది. అయితే మంత్రి పదవుల కోసం జరుగుతున్న పోటీ ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది. తెలంగాణ బీజేపీలో ఇప్పుడు నాయకత్వ ఆకాంక్షలు పెరిగాయి. గతంలో పార్టీకి రాష్ట్రంలో పరిమిత స్థాయిలోనే ప్రాతినిధ్యం ఉండేది. ఇప్పుడు మాత్రం అధికార ప్రత్యామ్నాయంగా ఎదగాలన్న లక్ష్యంతో ఉన్న పార్టీగా మారింది. అందుకే మంత్రి పదవుల కోసం ఇంతటి ఆసక్తి కనిపిస్తోంది. ఇది పార్టీ ఎదుగుదలకు సంకేతమే అయినప్పటికీ, అదే సమయంలో అంతర్గత అసంతృప్తులకు కూడా దారి తీసే అవకాశం ఉంది. కాబట్టి అధిష్టానం తీసుకునే నిర్ణయం సామాజిక, ప్రాంతీయ, రాజకీయ సమతుల్యతను కాపాడే విధంగా ఉండాలి. చివరికి కేంద్ర కేబినెట్ విస్తరణలో ఎవరికి అవకాశం దక్కినా, ఎవరికి నిరాశ ఎదురైనా అది రాజకీయ ప్రక్రియలో భాగమే. కానీ తెలంగాణ ప్రజలు ఎదురుచూస్తున్నది పేర్లు కాదు, ఫలితాలు. పదవులు కాదు, పనితీరు. కేబినెట్‌లో చోటు సంపాదించడం ఒక నాయకుడి రాజకీయ విజయమైతే, ఆ పదవిని రాష్ట్ర ప్రయోజనాల కోసం వినియోగించడం మాత్రమే ప్రజల దృష్టిలో నిజమైన విజయంగా నిలుస్తుంది. అందుకే రాబోయే కేబినెట్ విస్తరణను వ్యక్తుల విజయాపజయాల కోణంలో కాకుండా, తెలంగాణకు కేంద్ర రాజకీయాల్లో ఎంతటి ప్రాధాన్యం దక్కబోతోందన్న కోణంలో చూడాల్సిన అవసరం ఉంది. అదే ఈ విస్తరణ అసలు రాజకీయ ప్రాముఖ్యత.

## నాలుగోసారి గెలవడానికి వ్యూహాలేంటి..?

కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్...నాలుగోసారి అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. త్రిశూల వ్యూహంతో పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సర్, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులతో ప్రత్యర్థులను ఇరుకున పెట్టాలని ప్రయత్నిస్తోంది. బీహార్, బెంగాల్‌లో అనుసరించిన ఫార్ములానే...2029 ఎన్నికల్లో అమలు చేసేందుకు రెడీ అవుతోంది. ఇదే ఇవాల్టీ స్టోరీ బోర్డు. దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉంది. ఇక్కడ ఎన్నికలదే కీలక పాత్ర. అలాంటప్పుడు ఓటర్ల విషయంలో వారి అర్హతలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవటం చాలా అవసరం. ఈ ఉద్దేశంతోనే సర్ ప్రక్రియకు రూపకల్పన జరిగింది. కాకపోతే ఇప్పుడు జరుగుతున్నది సర్ కాదు ఓట్ల చోరీ అని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈసీ మాత్రం అవన్నీ అపోహలేనని కొట్టిపారేస్తోంది. దేశంలో ఓటర్ల జాబితాను అప్పుడప్పుడూ సవరించడం తప్పనిసరి. అర్హులకు చోటు కల్పించి అనర్హులపై వేటు వేసేందుకు సర్ నిర్వహించడమూ అవసరమే. దీనిపై ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండనవసరం లేదు. ఈ విషయమై ఎన్నికల సంఘానికి ప్రజాప్రాతినిధ్య చట్టం -1951 పూర్తి స్వేచ్ఛను కల్పించింది. ఈసీ ఈ విషయం లో ఎవరి అనుమతి తీసుకోవాల్సిన లేదా ఎవరికీ జవాబుదారీ వహించాల్సిన అవసరం లేదు. దేశంలో ఇలాంటివి జరగడం ఇదే కొత్త కూడా కాదు. 1952 నుంచి 2004 వరకు 13 సార్లు సర్ జరిగింది. కానీ, ప్రస్తుత సర్వే స్థాయిలో అవేవీ వివాదాల్లో చిక్కుకోలేదు. అయితే ఎన్నికల కమిషన్ విశ్వసనీయత కొడిగట్టిన ప్రస్తుత తరుణంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ వివాదాల సుడిగుండంలో చిక్కుకుంది. సర్ పేరిట జరుగుతున్న తతంగమంతా బీజేపీకి సానుకూలత, విపక్షాలకు ప్రతికూలత కల్పించేందుకేనని, అందుకు కృత్రిమమైనరీతిలో చేర్పులు, ప్రక్షాళనలు జరుగుతున్నాయని ప్రధానమైన ఆరోపణ. పనిలోపనిగా పౌరసత్వ పరీక్షలూ జరుగుతున్నాయనేది మరో ఆరోపణ. దాదాపు 20 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఎన్నికల సంఘం సర్వే చేపట్టింది. అందులోనూ మొదటి విడతగా బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిర్వహించడంపై ఇప్పటికే తీవ్ర దుమారం చెలరేగింది. మార్పుల తర్వాత జాబితాలో 50 లక్షలకు పైగా ఓటర్ల పేర్లు గల్లంతు కావడంపై పార్లమెంటు కూడా దద్దరిల్లింది. ఈ వివాదం ఒక కొలిక్కి రాకుండానే దేశమంతటా సర్ కార్యక్రమం చేపట్టనున్నట్టు ఎన్నికల కమిషన్ గత అక్టోబర్ 27న ప్రకటించింది. దీనిపై విపక్ష పాలిత రాష్ట్రాలు తీవ్ర వ్యతిరేకత తెలిపాయి. ముఖ్యంగా తమిళనాడు, పశ్చిమబెంగాల్ ప్రతిఘటించి తీరుతామని శపథం పూనాయి. కానీ తీవ్ర నిరసనల మధ్యే సర్ ప్రక్రియ పూర్తయింది. ఎన్నికల్లో తమ ఓటమికి సర్ తోనే పునాది పడిందని బెంగాల్లో మమతా బెనర్జీ సుప్రీందాకా వెళ్లి మరీ ప్రతిఘటించారు. దీంతో సుప్రీంకోర్టు సర్ ప్రక్రియ కోసం జ్యుడీషియల్ అధికారులను నియమించింది. చివరకు వారిని కూడా ఘెరావ్ చేసే దుస్థితి రావడం, తమ ఆదేశాల్ని కూడా బెంగాల్ రాష్ట్ర యంత్రాంగం బేఖాతరు చేయడాన్ని సుప్రీం తీవ్రంగా పరిగణించింది. కేంద్ర బలగాల రక్షణలో సర్ జరగాల్సిందేనని, సర్‌కు ఎక్కడైనా ఆటంకాలు ఎదురైతే చూస్తూ ఊరుకునేది లేదని సుప్రీంకోర్టు హెచ్చరించింది. సర్ నిబంధనల మేరకు జరగకపోతే ఆధారాలతో ఫిర్యాదు చేయెుచ్చు కానీ.. అసలు ప్రక్రియనే వద్దనడం పద్ధతి కాదని సర్వోన్నత న్యాయస్థానం పార్టీలకు తలంటింది. ఉత్తరప్రదేశ్ సర్‌లో ఏకంగా సుమారు 20 శాతం ఓటర్ల పేర్లు, అంటే 2.89 కోట్ల ఓట్లు గల్లంతవడం కలకలం రేపింది. రాష్ట్రంలోని మొత్తం ఓట్ల సంఖ్య 15.44 కోట్ల నుంచి 12.55 కోట్లకు తగ్గిపోయింది. ఇక రాజధాని లక్నోలో 39.9 లక్షల ఓట్లుంటే అందులో 30 శాతం సర్వేలో ఎగిరిపోయి చివరకు 27.9 లక్షలే మిగిలాయి. అందులో కొందరు ఓటర్లు చనిపోయారని, మరికొందరు వేరే ప్రాంతాలకు వలసపోయారని, ఇంకొందరి పేర్లు రెండు లేదా అంతకంటే ఎక్కువచోట్ల ఉన్నాయని కమిషన్ వివరణ ఇచ్చింది. ఏదేమైనప్పటికీ భారీ స్థాయిలో ఓట్ల తొలగింపుపై రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్ కార్యక్రమం వల్ల ఓటర్లలో కొన్ని వర్గాలు తీవ్ర ప్రభావానికి గురయ్యాయని ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ ఆరోపించింది. సర్‌పై సర్వోన్నత న్యాయస్థానంలో తమిళనాడు న్యాయపోరాటానికి దిగింది. ఎన్నికల సంఘం చేపట్టిన సవరణకు ఎలాంటి రాజ్యాంగ బద్ధత, చట్టబద్ధత లేదని, పారదర్శకత, సమన్యాయం లోపించాయని ఆరోపించింది. బెంగాల్‌లో ఏకంగా నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్‌కు సర్ యంత్రాంగం విచారణ నోటీసు పంపించడంపై వివాదం రేగింది. దేశ విభజన నుంచి బంగ్లా యుద్ధం దాకా అనేక చారిత్రక కారణాల వల్ల బెంగాల్‌లో పౌరసత్వ సమస్యలున్నాయి. సర్ పేరిట దొడ్డిదారిన సిటిజన్‌షిప్ రిజిష్టర్‌ను ప్రవేశపెడుతున్నారని టీఎంసీ మండిపడింది. ఈ వివాదాల వెనుక నిజానిజాల మాట అటుంచితే, ప్రజలకూ, పార్టీలకూ సర్‌పై అంతులేనన్ని అనుమానాలున్నాయన్న మాట నిజం. పార్టీలు ఎప్పుడూ లేని విధంగా ఎన్నికల సంఘంపై కూడా నమ్మకం ఉంచటం లేదు. అయితే బెంగాల్ సర్ విషయంలో అభ్యంతరాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని అడిగితే.. ఏ పార్టీ నుంచీ స్పందన రాలేదు. కనీసం తుది జాబితాపై అభ్యంతరాలు అడిగినా.. ఎవరూ ముందుకు రాలేదు. తగినంత సమయం ఇచ్చిన తర్వాత కూడా ఎలాంటి స్పందన లేకపోవడంతో.. సర్‌ను రాజకీయ వివాదంగా మార్చొద్దని సుప్రీంకోర్టు చెప్పాల్సి వచ్చింది. ప్రస్తుతం తెలంగాణలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ.. సర్ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎన్నికల కమిషన్‌ను పీసీసీ కోరింది. రాష్ట్రంలో ఎన్నికలకు ఇంకా రెండేళ్లకు పైగా సమయం ఉన్నందున ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా 2-3 నెలల్లో హడావిడిగా ముగించకుండా, ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని సూచించింది. సర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకోవడానికి గడువును 3 నెలలకు పెంచాలని విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే జనగణన ప్రక్రియ జరుగుతున్నందున దాంతోపాటే సర్ నిర్వహిస్తే.. సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుందనే ఆందోళ కూడా ఉంది. బూత్ లెవెల్ అధికారులు ప్రత్యక్షంగా 3-4 సార్లు ప్రతి ఇంటికి వెళ్లి ఓటు తనిఖీ చేయాలి. విదేశీయులు ఉన్నారనే నెపంతో ఓట్లు తొలగించే ప్రక్రియ సరికాదనే సూచనలు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా హైదరాబాద్ లో ముస్లిం ఓటర్లు, ఏపీ ఓటర్ల పేర్ల తొలగింపుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటిదాకా సర్ జరిగిన రాష్ట్రాల్లో ఎదురైన అనుభవాల్ని బట్టి.. పాతబస్తీలో ముస్లిం ఓట్లను గంపగుత్తగా తొలగించి.. పౌరసత్వ నిరూపణ అడుగుతారేమోననే భయాలు లేకపోలేదు. అలాగే ఏపీ ఓటర్ల పేర్లు పెద్ద సంఖ్యలో తొలగిస్తే.. జీహెచ్‌ఎంసీలో చాలా నియోజకవర్గాల్లో ఫలితాలు తీవ్రంగా ప్రభావితం అవుతాయనే భయం అన్ని పార్టీల్లోనూ ఉంది. ఉదాహరణకు బెంగాల్‌లో సర్ కారణంగా టీఎంసీతో పాటు అనూహ్యంగా బీజేపీకీ నష్టం తప్పలేదు. ఇక్కడ కూడా సర్ పూర్తయ్యాక.. ఏ పార్టీకి ఎంత నష్టం జరుగుతుందో తేలుతుందని పార్టీలు భావిస్తున్నాయి. ప్రస్తుతానికి అన్ని పార్టీలూ.. సర్ విషయంలో ముందస్తు సన్నద్ధతను పూర్తిచేసినా.. చివరకు ఏమౌతుందోననే టెన్షన్ మాత్రం అందరికీ తప్పటం లేదు. సర్ ప్రక్రియలో ఏ ప్రాంతంలో ఎలాంటి నిబంధనలు తెరపైకి వస్తాయి..? ఓటర్ల విషయంలో ఈసీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది..? పార్టీల అభ్యంతరాలకు ఏ మేరకు విలువ ఇస్తారు..? ఇవన్నీ ప్రస్తుతానికి సమాధానం లేని ప్రశ్నలే. కానీ తెలుగు రాష్ట్రాల్లో కూడా బీజేపీకి అనుకూలంగా సర్ జరుగుతుందేమోనని ప్రతిపక్షాలు గట్టిగా అనుమానిస్తున్నాయి. తుది జాబితాలు వెల్లడయ్యాకే.. అసలు విషయ తెలుస్తుందని, అందాకా ఓపిక పట్టాలని కాషాయ పార్టీ కౌంటరిస్తోంది. మరోవైపు తమను ఏం డాక్యుమెంట్లు అడుగుతారోనని కొందరు ఓటర్లు కూడా కంగారు పడుతున్నారు. ఓటర్ల జాబితాలో పారదర్శకత కోసం సర్ అవసరమే అనే వాదనతో అన్ని పార్టీలూ ఏకీభవిస్తున్నాయి. కానీ సర్ ప్రక్రియకు ఎంచుకుంటున్న సమయం, సందర్భంపై మాత్రం భిన్నాభిప్రాయాలు వస్తున్నాయి. ఇక్కడ అవకతవకలు ఉన్నాయా.. లేదా అనేది పక్కనపెడితే.. అసలు అనుమానాలు కలిగేలా ఎందుకు వ్యవహరించాలనే ప్రశ్నకు మాత్రం కచ్చితంగా జవాబు వెతకాల్సిందే. అటు పార్టీలు, ఇటు ఓటర్లు అందరిలోనూ నమ్మకం కలిగించే విధంగా ఈసీ విధానాలకు పదునుపెట్టాలనే సలహాలు వస్తున్నాయి. అనవసర ఆందోళనలు, వివాదాలకు తావివ్వకుండా.. ఎవ్వరూ వేలెత్తిచూపటానికి వీల్లేని విధంగా తెలుగు రాష్ట్రాల్లో సర్ జరగాలనే భావన వ్యక్తమవుతోంది. అయితే మన దగ్గర బీహార్, బెంగాల్ మాదిరి రగడకు ఆస్కారం లేదని, ఇక్కడ చాలావరకు ఓటర్లకు సరైన పత్రాలుంటాయనే అభిప్రాయాలు కూడా లేకపోలేదు.

## విమర్శలకు అతీతమా?

ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు మూడు ప్రధాన స్తంభాలు. ఈ మూడు వ్యవస్థలూ రాజ్యాంగ పరిమితుల్లో పనిచేస్తూ ప్రజల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను నిర్వర్తిస్తాయి. అయితే, ప్రజాస్వామ్యానికి మూలమైన జవాబుదారీతనం, పారదర్శకత, ప్రజా పర్యవేక్షణ వంటి విలువలు ఏ ఒక్క వ్యవస్థకూ మినహాయింపు కావు. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యలో న్యాయవ్యవస్థలోని జాప్యం, అవినీతి ఆరోపణలు, వ్యవస్థాపరమైన లోపాలపై ప్రస్తావన రావడాన్ని చుట్టుముట్టిన వివాదం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇటీవల పాఠశాల పాఠ్యాంశాల్లో న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రస్తావించడం పట్ల ఉన్నత న్యాయవర్గాలు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. బాలల మనసుల్లో న్యాయవ్యవస్థపై ప్రతికూల అభిప్రాయం ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్తమైంది. అయితే ఇక్కడ అసలు ప్రశ్న ఏమిటంటే -- వాస్తవ పరిస్థితులను విద్యార్థులకు తెలియజేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమా? లేక అవగాహన పెంపొందించే ప్రయత్నమా? నిజానికి న్యాయవ్యవస్థ దేశ ప్రజాస్వామ్యానికి రక్షకవలయంగా నిలిచిన అనేక సందర్భాలు ఉన్నాయి. పౌరహక్కుల పరిరక్షణ, అధికార దుర్వినియోగాల నియంత్రణ, రాజ్యాంగ పరిరక్షణలో న్యాయస్థానాల పాత్ర విశిష్టమైనది. అదే సమయంలో వ్యవస్థలోని లోపాలను కూడా విస్మరించలేం. దేశవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉండటం, దశాబ్దాల పాటు కొనసాగే విచారణలు, న్యాయమూర్తుల ఖాళీలు, తీర్పుల జాప్యం వంటి సమస్యలు సాధారణ ప్రజలకు ప్రత్యక్షంగా కనిపిస్తున్న వాస్తవాలు. "ఆలస్యమైన న్యాయం అంటే నిరాకరించబడిన న్యాయం" అనే న్యాయసూత్రం ప్రపంచవ్యాప్తంగా ఆమోదించబడింది. అయితే భారతదేశంలో కేసుల పరిష్కార వేగం గురించి తరచుగా ప్రశ్నలు తలెత్తుతూనే ఉన్నాయి. సుప్రీంకోర్టు నుంచి జిల్లా కోర్టుల వరకు పెండింగ్ కేసుల సంఖ్య ఆందోళన కలిగించే స్థాయిలో ఉంది. ఈ పరిస్థితిపై చర్చ జరగకూడదని చెప్పడం కంటే, దానిని ఎలా సరిదిద్దాలన్నదానిపై దృష్టి పెట్టడం సముచితం. అవినీతి అంశం మరింత సున్నితమైనది. న్యాయవ్యవస్థలోని ప్రతి వ్యక్తిని లేదా మొత్తం వ్యవస్థను అవినీతిపరమైందిగా చిత్రీకరించడం ఎంత తప్పో, అక్కడ ఎలాంటి సమస్యలే లేవని చెప్పడం కూడా అంతే తప్పు. గతంలో కొందరు న్యాయమూర్తులపై వచ్చిన ఆరోపణలు, వివాదాలు, విచారణలు ప్రజల ముందే జరిగాయి. అవి వ్యవస్థలో సంస్కరణల అవసరాన్ని గుర్తు చేస్తాయి. సమస్యలను అంగీకరించడం సంస్థ బలహీనత కాదు; వాటిని సరిదిద్దే సంకల్పమే సంస్థ బలానికి నిదర్శనం. విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థ గురించి బోధించేటప్పుడు కేవలం గొప్పతనాన్ని మాత్రమే చెప్పడం సరిపోదు. విజయాలతో పాటు సవాళ్లు, బలాలతో పాటు బలహీనతలు, సాధించిన పురోగతితో పాటు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా పరిచయం చేయాలి. అప్పుడు మాత్రమే విమర్శనాత్మక ఆలోచన, బాధ్యతాయుత పౌరస్ఫూర్తి పెంపొందుతుంది. ప్రజాస్వామ్యం అంటే ప్రశ్నించే హక్కు, సమాధానం చెప్పే బాధ్యత రెండూ కలిసే ఉండాలి. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం అత్యంత విలువైనది. కానీ ఆ విశ్వాసం విమర్శలను అణచివేయడం ద్వారా కాదు; పారదర్శకత, జవాబుదారీతనం, సమర్థత ద్వారా బలపడుతుంది.



ప్రజల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం, వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడం, న్యాయప్రక్రియను మరింత వేగవంతం చేయడం ద్వారా మాత్రమే విశ్వసనీయత పెరుగుతుంది. ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థా ప్రశ్నలకు అతీతం కాదు. అదే సమయంలో ఏ వ్యవస్థనూ నిరాధారంగా అపనమ్మకానికి గురిచేయడం కూడా సమంజసం కాదు. కాబట్టి విద్యా పాఠ్యాంశాలు సమతుల్య దృక్పథంతో రూపొందాలి. న్యాయవ్యవస్థ గొప్పతనాన్ని చెప్పడమే కాక, దాని ముందున్న సవాళ్లను కూడా విద్యార్థులకు తెలియజేయాలి. ఎందుకంటే అవగాహనతో కూడిన పౌరసమాజమే బలమైన ప్రజాస్వామ్యానికి పునాది. న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని కాపాడే మార్గం వాస్తవాలను దాచడం కాదు; వాటిని ధైర్యంగా ఎదుర్కొని సంస్కరణల దిశగా అడుగులు వేయడమే.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# ఐదు ప్రత్యేక రిటైల్ దుకాణాలు






**ఎల్ బి నగర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** యూరోగ్రిప్ టైర్స్, టీవీఎస్ శ్రీచక్ర లిమిటెడ్‌కు చెందిన భారతదేశ ప్రముఖ ద్విచక్ర మరియు త్రిచక్ర వాహన టైర్ బ్రాండ్, తెలంగాణలోని హైదరాబాద్‌లో ఐదు కొత్త ప్రత్యేక రిటైల్ దుకాణాలను ప్రారంభించినట్లు ఈరోజు ప్రకటించింది . వీటిలో మూడు స్టోర్లను హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సహకారంతో వారి వ్యాపార భాగస్వామి ద్వారా ఫ్రాంచైజీ చేయబడ్డాయి. ఈ నూతన స్టోర్ల ప్రారంభం, భారతదేశవ్యాప్తంగా యూరోగ్రిప్ టైర్స్ తన రిటైల్ విస్తరణ వ్యూహాన్ని కొనసాగిస్తున్నట్లు సూచిస్తోంది. వీటి ద్వారా సంస్థ తన మార్కెట్ ఉనికిని మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు, కస్టమర్లకు సమగ్ర టైర్ మరియు ద్విచక్ర వాహన సంరక్షణ సేవలను ఒకే చోట అందించాలనే తన నిబద్ధతను మరోసారి చాటుతోంది. ఈ స్టోర్‌ను మిస్టర్. సిల్వియో మొంటానారి, డిజైన్ హెడ్, యూరోగ్రిప్--మిలాన్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మిస్టర్ టి.కె.రవి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, టీవీఎస్ శ్రీచక్ర లిమిటెడ్ మాట్లాడుతూ, "అధిక నాణ్యత గల ప్రోడక్టులు మరియు సేవలను మా కస్టమర్లకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో మేము ముందుకు సాగుతున్నాము. హైదరాబాద్‌లో ఈ ఐదు ప్రత్యేక రిటైల్ దుకాణాల ప్రారంభం మా విస్తరణ ప్రయాణంలో మరో కీలక మైలురాయిగా నిలుస్తోంది. ద్విచక్ర వాహనాల వినియోగం అధికంగా ఉన్న హైదరాబాద్, యూరోగ్రిప్ టైర్స్‌కు అత్యంత ప్రాధాన్య మార్కెట్లలో ఒకటి. ఈ కొత్త దుకాణాల ద్వారా, రైడర్లు నిపుణుల మద్దతు మరియు సేవలతో పాటు మా పూర్తి టైర్ పోర్ట్‌ఫోలియోను సౌకర్యవంతంగా యాక్సెస్ చేయవచ్చు," అని తెలిపారు. కొత్తగా ప్రారంభించిన ఈ దుకాణాల్లో యూరోగ్రిప్ టైర్స్‌కు చెందిన పూర్తి స్థాయి ప్రోడక్టుల శ్రేణి వివిధ నమూనాలు, సైజుల్లో అందుబాటులో ఉంటుంది. అలాగే, విభిన్న రకాల ద్విచక్ర వాహనాలకు అనుకూలంగా రూపొందించిన ట్యూబ్‌ల విస్తృత శ్రేణి కూడా కస్టమర్లకు లభిస్తుంది. స్కూటర్లు, కమ్యూటర్ మోటార్‌సైకిళ్లు, మిడ్-రేంజ్ పెర్ఫార్మెన్స్ బైకులు, అడ్వెంచర్ టూరింగ్ మోటార్‌సైకిళ్లు, సూపర్‌బైకులు వంటి వివిధ వాహన విభాగాల అవసరాలను తీర్చే ఉత్పత్తులను ఒకే చోట అందించడం ఈ ప్రత్యేక రిటైల్ దుకాణాల ప్రధాన లక్ష్యం. ప్రోడక్టు శ్రేణితో పాటు, ఈ ప్రత్యేక రిటైల్ దుకాణాలు ప్రొఫెషనల్ టైర్ ఫిట్‌మెంట్, టైర్ నిర్వహణ సేవలు, పంక్చర్ మరమ్మతులు, గాలి ఒత్తిడి (ఎయిర్ ప్రెజర్) తనిఖీలు వంటి సేవలు ఉన్నాయి. అవుట్‌లెట్లు కస్టమర్లకు వారంటీ-సంబంధిత ప్రశ్నలతో కూడా సహాయపడతాయి, ఇది సజావు మరియు నమ్మదగిన యాజమాన్య అనుభవాన్ని నిర్ధారిస్తుంది.

కస్టమర్లకు స్థిరమైన మరియు విశ్వసనీయ సేవా అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా, భారతదేశంలోని కీలక మార్కెట్లలో తన బ్రాండెడ్ రిటైల్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసే విస్తృత వ్యూహంలో భాగంగానే ఈ విస్తరణ చేపట్టినట్లు కంపెనీ తెలిపింది. హైదరాబాద్, పానిపట్, బహ్రాయిచ్, లూధియానా, ఢిల్లీ మరియు అలప్పుజాలో ఇటీవల ప్రారంభించిన కొత్త దుకాణాలతో పాటు, యూరోగ్రిప్ టైర్స్ ఇప్పటికే చెన్నై, మైసూరు, పాట్నా, ఫరూఖాబాద్, అహ్మదాబాద్ మరియు రాజ్‌కోట్ నగరాల్లో కూడా రిటైల్ ఎక్స్‌పీరియన్స్ దుకాణాలను నిర్వహిస్తోంది.

**కొత్త స్టోర్లు ఈ క్రింది చిరునామాల్లో ఉన్నాయి:**

గ్రీన్ సెక్యూర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్,
HPCL, సర్వే నం. 73,
ప్లాట్ నం. 21, 53 & 54, సికింద్రాబాద్ కంటోన్మెంట్,
తూర్పు మారేడ్‌పల్లి,
హైదరాబాద్, తెలంగాణ 500026
ఫోన్ -- 9618433000

గ్రీన్ సెక్యూర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్,
సర్వే నం. 53,
షాప్ నం. 2 & 3,
ప్లాట్ నం. 2D, 54, X రోడ్,
ఎల్. బి. నగర్, చింతలకుంట,
హైదరాబాద్, తెలంగాణ 500074
ఫోన్ -- 9618433000

గ్రీన్ సెక్యూర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్,
HPCL, సర్వే నం. 78
శేరిలింగంపల్లి, గోపన్‌పల్లి,
హైదరాబాద్, తెలంగాణ 500046
ఫోన్ -- 9618433000

గ్రీన్ సెక్యూర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్,
న్యూజా, సర్వే నం. 104,
గుల్మోహర్ పార్క్ కాలనీ,
లింగంపల్లి, శేరిలింగంపల్లి (M),
తెలంగాణ 500019
ఫోన్ -- 9618433000

గ్రీన్ సెక్యూర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్,
షాప్ నం. 1, ప్లాట్ నం. 1280,
కున్ హ్యుందాయ్ (Kun Hyundai) సర్వీస్ సెంటర్ పక్కన,
కొండాపూర్, తెలంగాణ -- 500084.
ఫోన్ -- 9618433000

# ఇకపై వ్యక్తికి 7 కేజీల రేషన్!



**న్యూ ఢిల్లీ :** దేశంలోని అత్యంత పేద కుటుంబాలకు రేషన్ పంపిణీ విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. ఇందులో భాగంగా అంత్యోదయ అన్నయోజన స్కీమ్‌లో మార్పులకు కసరత్తు మొదలు పెట్టింది. జాతీయ ఆహార భద్రత చట్టం కింద ఇచ్చే అంత్యోదయ అన్న యోజన రేషన్ కోటాలో మార్పులు చేస్తూ 'నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ (అమెండ్‌మెంట్) బిల్లు, 2026' ముసాయిదాను కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ ప్రజాభిప్రాయం కోసం విడుదల చేసింది. దీని ప్రకారం ఇకపై అంత్యోదయ అన్న యోజన స్కీమ్ లబ్ధిదారుల్లో వ్యక్తికి ఏడు కేజీల చొప్పున రేషన్ ఇవ్వాలని ప్రతిపాదన చేసింది.

**గరిష్టంగా 35 కిలోలు:**

ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం.. అంత్యోదయ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి, వారి కుటుంబంలో ఎంతమంది సభ్యులు ఉన్నారనే దానితో సంబంధం లేకుండా నెలకు ఫిక్స్‌డ్‌గా 35 కిలోల రేషన్ ఇస్తున్నారు. దీనివల్ల చిన్న కుటుంబాల్లోని లబ్ధిదారులకు, ఎక్కువ మంది ఉన్న లబ్ధిదారులు ఉన్న కుటుంబాలకు అంతే రేషన్ లభిస్తోంది. ఈ వ్యత్యాసాలను తొలగించడంలో భాగంగా ఈ మార్పులు తీసుకువస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. ఈ కొత్త సవరణ బిల్లు ప్రకారం ఇకపై కుటుంబం ప్రాతిపదికన కాకుండా, కుటుంబంలోని ప్రతి వ్యక్తి (లబ్ధిదారుడు) లెక్కన నెలకు 7 కిలోల చొప్పున ఆహార ధాన్యాలను పంపిణీ చేయనున్నారు. అయితే ఒక కుటుంబానికి నెలకు ఇచ్చే గరిష్ట రేషన్ కోటాను మాత్రం 35 కిలోలకే పరిమితం చేయనున్నట్లు స్పష్టం చేశారు .

**చిన్న కుటుంబాలకు కోత:**

కొత్త ప్రతిపాదనలు అమల్లోకి వస్తే అంత్యోదయ కార్డులో పేరున్న ప్రతి ఒక్కరికీ నెలకు సబ్సిడీ ధరపై 7 కిలోల ఆహార ధాన్యాలు లభిస్తాయి. ఈ విధానం చిన్న కుటుంబాలకు కోటాలో కోత పడనుంది. అంటే ఏదైనా కుటుంబంలో సభ్యుల సంఖ్య 5 కంటే తక్కువ ఉంటే, ఆ సంఖ్య ఆధారంగా రేషన్ తగ్గుతుంది. ఉదాహరణకు ముగ్గురు (3) లబ్ధిదారులు ఉన్న కుటుంబానికి ప్రస్తుతం 35 కిలోల రేషన్ లభిస్తుంటే ఇకపై ఒక్కో వ్యక్తికి 7 కిలోల చొప్పున నెలకు కేవలం 21 కిలోలు మాత్రమే అందనున్నాయి. ఇక పెద్ద కుటుంబంలో 5 లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులు ఉన్నప్పటికీ ఆ కుటుంబానికి నెలకు లభించే మొత్తం రేషన్ 35 కిలోల కంటే మించదు. అంత్యోదయ అన్న యోజన కింద ప్రస్తుతం ఉన్న కుటుంబ ఆధారిత కోటా వల్ల సభ్యుల సంఖ్యను బట్టి అసమానతలు వస్తున్నాయని వీటిని తొలగించి అందరికీ సమానమైన పంపిణీ కోసమే ఈ సవరణ తెస్తున్నట్లు ముసాయిదాలో పేర్కొన్నారు. ఈ డ్రాఫ్ట్ బిల్లుపై దేశ ప్రజలు, సంబంధిత వర్గాల నుంచి కేంద్ర ప్రభుత్వం సూచనలు, సలహాలను ఆహ్వానించింది. ఆసక్తి ఉన్నవారు తమ అభిప్రాయాలను 2026 జూలై 13వ తేదీ లోగా కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖకు సమర్పించవచ్చుని పేర్కొన్నారు.

# తుంగభద్ర ప్రాజెక్టు వద్ద అపూర్వ ఘట్టం..



**కర్ణాటక :** కర్ణాటక లోని హోస్పేట వేదికగా అరుదైన చిత్రం చోటుచేసుకుంది. తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవానికి ముందు ఐఆర్‌బీ గెస్ట్‌హౌస్‌లో కేంద్ర మంత్రి, తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులు, కర్ణాటక సీఎం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ కీలక భేటీలో ఏపీ సీఎం చంద్రబాబు , తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి , కర్ణాటక సీఎం డీకే శివకుమార్, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ పాల్గొన్నారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలు, జలవనరుల ప్రాజెక్టుల నిర్వహణ, పరస్పర సహకారంపై ఈ సందర్భంగా నేతల మధ్య చర్చ జరిగినట్లుగా తెలుస్తోంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా పాల్గొన్నారు. తుంగభద్ర డ్యామ్ గేట్ కొట్టుకుపోయిన ఘటన తర్వాత యుద్ధప్రాతిపదికన కొత్త గేట్ల ఏర్పాటును పూర్తి చేశారు. ప్రస్తుతం ఆ గేట్లను ప్రారంభించడానికి ముందు జరిగిన ఈ భేటీ ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజల్లో, రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.




# తెలుగు రాష్ట్రాలు సహా 16 రాష్ట్రాల్లో సీబీఐ రెయిడ్స్

**న్యూ ఢిల్లీ :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న డిజిటల్ అరెస్టులపై సీబీఐ పంజా విసిరింది. ఈ స్కామ్‌ల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ గురువారం భారీ ఆపరేషన్ చేపట్టింది. ఇవాళ దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లోని 80 ప్రాంతాల్లో ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించింది. సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌ను పోలిన ఒక నకిలీ వెబ్‌సైట్‌ను గుర్తించిన నేపథ్యంలో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, గుజరాత్, ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, అస్సాం, పశ్చిమ బెంగాల్, మణిపూర్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి.

**రూ.2 కోట్ల లావాదేవీలు.. ఇద్దరి అరెస్ట్**

200కు పైగా డిజిటల్ అరెస్ట్ కేసులతో సంబంధం ఉన్న ఒక పెద్ద నేరపూరిత నెట్‌వర్క్‌ను నిర్మూలించడమే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లు సీబీఐ ప్రతినిధి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నకిలీ కంపెనీలను (షెల్ కంపెనీలు) సృష్టించి, సైబర్ నేరగాళ్లకు సహకరిస్తూ... మ్యూల్ బ్యాంక్ ఖాతాల (మనీ లాండరింగ్ కోసం వాడే ఇతరుల ఖాతాలు) ద్వారా దాదాపు రూ. 2 కోట్ల అక్రమ సొమ్మును దారి మళ్లించినందుకు గానూ చెన్నైకి చెందిన బి. నరేష్, కోల్‌కతాకు చెందిన సంజీబ్ సాహాలను సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ తనిఖీల్లో భారీ ఎత్తున నేరానికి సంబంధించిన పత్రాలు, డిజిటల్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, బ్యాంక్ లావాదేవీల రికార్డులను సీబీఐ స్వాధీనం చేసుకున్నారు. వీటిని మరింత లోతుగా విశ్లేషించేందుకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. అయితే ఈ ముఠా కేవలం భారతీయులనే కాకుండా, పలు ఇతర దేశాల పౌరులను కూడా మోసం చేసినట్లు ఆధారాలు లభించడంతో.. సీబీఐ అంతర్జాతీయ ఛానెల్స్ ద్వారా ఆయా దేశాల దర్యాప్తు సంస్థలను కూడా అలర్ట్ చేసినట్లు సమాచారం.

# ప్రైవేట్ బడుల్లో 'బిజినెస్'!

**ఆదిలాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆదిలాబాద్ జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీ తల్లిదండ్రులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో అడ్మిషన్లు, బుక్స్, యూనిఫామ్‌ల పేరుతో విచ్చలవిడిగా వసూళ్లకు తెగబడుతున్నారు. వార్షిక ఫీజులో సగం డబ్బులు ముందు కడితేనే పాఠ్యపుస్తకాలు ఇస్తామంటూ విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారు. తాము కుదుర్చుకున్న బుక్ స్టోర్లు, బట్టల షాపుల్లోనే సామగ్రి కొనాలంటూ కమీషన్ల దందాకు తెరలేపారు. కొన్ని పాఠశాలలు కనీస ప్రభుత్వ అనుమతులు, ఆటస్థలాలు, మరుగుదొడ్ల వంటి వసతులు లేకుండానే నడుస్తున్నాయి. ప్రైవేట్ స్కూళ్ల అక్రమాలపై విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు కంటితుడుపు చర్యలకే పరిమితమయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రైవేట్ స్కూళ్ల ఫీజులను నియంత్రించి, అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్య సేవగా ఉండాల్సిన చోట వ్యాపారంగా మారుతుందన్న విమర్శలు జిల్లాలో బలంగా వినిపిస్తున్నాయి. పిల్లల భవిష్యత్తును ఆసరాగా చేసుకుని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తల్లిదండ్రులపై భారీ ఆర్థిక భారం మోపుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు బోథ్, ఉట్నూర్, ఇచ్చోడ తదితర ప్రాంతాల్లో స్కూల్ ఫీజులతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు, బ్యాగులు, షూస్, స్టేషనరీ వస్తువుల పేరుతో అదనపు వసూళ్లకు తెరలేపారు. ఇటీవల పలు విద్యార్థి సంఘాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న పుస్తకాల విక్రయాలపై ఆందోళనలు చేపట్టి అధికారుల సహకారంతో వాటిని సీజ్ చేయించినా లాభం లేకుండా పోయింది. జిల్లా విద్యాశాఖ పరిధిలో 170 ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు 50 వేల మంది విద్యార్థులు చదువుతుండడంతో, ఇక్కడ ప్రైవేట్ విద్య పెద్ద వ్యాపారంగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఫీజుల మోత... కమిషన్ల దందా..**

జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఎల్‌కేజీ, యూకేజీ తరగతులకే రూ. 20వేల నుంచి రూ. 40 వేల వరకు, ప్రాథమిక తరగతులకు రూ. 40వేలు, పదో తరగతికి ఏకంగా రూ. లక్ష వరకు ఫీజులు గుంజుతున్నాయి. దీనికి తోడు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, టై, బెల్టులు వంటి వస్తువులను కూడా పాఠశాలల ద్వారానే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. మార్కెట్‌లో తక్కువ ధరలకు లభించే వస్తువులను తమకు అనుబంధంగా ఉన్న బుక్ స్టోర్లలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కొన్ని యాజమాన్యాలు వార్షిక ఫీజులో 50 శాతం అడ్వాన్స్ చెల్లిస్తేనే పాఠ్యపుస్తకాలు అందజేస్తామని కరాఖండిగా చెబుతున్నాయి. బడి ప్రారంభానికి ముందే తల్లిదండ్రులకు ఫోన్లు చేసి నిర్దిష్ట దుకాణాలకే వెళ్లాలని సూచిస్తుండడంతో, స్కూల్ యాజమాన్యాలు, వ్యాపారుల మధ్య భారీగా కమీషన్ల దందా నడుస్తోందన్న చర్చ సాగుతోంది.

**అనుమతులు లేవు.. పర్యవేక్షణా లేదు..**

జిల్లాలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు కనీసం పూర్తిస్థాయి ప్రభుత్వ అనుమతులు లేకుండానే అడ్మిషన్లు చేపట్టి తరగతులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, క్రీడా మైదానాలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు లేకపోయినా ఫీజుల వసూళ్లలో మాత్రం వెనకడుగు వేయడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ అక్రమ విక్రయాలు, దోపిడీపై జిల్లా విద్యాశాఖకు ఫిర్యాదులు అందినప్పటికీ కఠిన చర్యలు కరువయ్యాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ, అనుమతుల పరిశీలనపై ఉన్నతాధికారులు తక్షణమే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ తనిఖీలు నిర్వహించాలని విద్యార్థి సంఘాలు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి.


# బండి సంజయ్ కీలక పోస్ట్



**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** కరీంనగర్ కార్పొరేషన్ డ్రైనేజీల నుండి బయటకు తీసిన టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త కుప్పల ఫొటోలను షేర్ చేస్తూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సోషల్ మీడియా వేదికగా పౌర బాధ్యత పై ఒక కీలక పోస్ట్ పెట్టారు. "ఇది కేవలం కరీంనగర్ డ్రైనేజీల నుండి తీసిన చెత్త కుప్ప మాత్రమే కాదు.. మన అజాగ్రత్తకు నిలువెత్తు నిదర్శనం" అని ఆయన పేర్కొన్నారు. నగరంలోని కోర్టు జంక్షన్, ట్రినిటీ కాలేజ్, కెమిస్ట్రీ భవన్ వంటి అత్యంత రద్దీ ప్రాంతాల గుండా నిత్యం వేలాది మంది ప్రయాణిస్తూ.. రోడ్డుపై పడేసిన ఒక్కో ప్లాస్టిక్ బాటిల్, కప్పు కాల్వల్లో చేరి దశాబ్దాలుగా డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీ విజయం సాధించిన తర్వాత, దశాబ్దాలుగా పేరుకుపోయిన ఈ మట్టి, వ్యర్థాలను తొలగించడానికి ప్రత్యేక నిధులను వెచ్చిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిబద్ధతను బండి సంజయ్ ఉదహరించారు. "మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎక్కడైనా చిన్న ప్లాస్టిక్ కాగితం, వాటర్ బాటిల్ కనిపిస్తే.. డస్ట్‌బిన్ దొరికే వరకు వాటిని తన జేబులోనే ఉంచుకుంటారనే విషయం మనందరికీ తెలుసు. దేశ ప్రధానికే అంతటి వ్యక్తిగత బాధ్యత ఉన్నప్పుడు, మన నగర పారిశుధ్యంపై మనకు ఎందుకు బాధ్యత ఉండాలి అని ప్రశ్నించారు. కరీంనగర్‌ను పరిశుభ్రంగా ఉంచడానికి కొత్తగా ప్రభుత్వ జీవోలు అవసరం లేదని, కేవలం ప్రజల ఆలోచనా విధానంలో మార్పు వస్తే చాలన్నారు. ఇది మన నగరం, మన వీధులు, మన బాధ్యత అని గుర్తు చేస్తూ.. ఇకపై ప్లాస్టిక్ బాటిళ్లు, వ్యర్థాలను రోడ్లపై, కాల్వల్లో పడేయకుండా డస్ట్‌బిన్లలోనే వేయాలని, కరీంనగర్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు.

# హ్యాకర్స్ కాదు పిల్లల పనే!

- ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలుగా చిన్నారులు
- యూపీఐ ద్వారా వేల లావాదేవీలు విచారణలో
- వెలుగులోకి వచ్చినట్లు సీపీ వెల్లడి



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఇటీవల ఫోన్ హ్యాకింగ్ కేసులు పెరిగిపోతున్నాయి. రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ ప్రత్యేక బృందం విచారణ చేపట్టగా షాకింగ్ విషయాలు వెలుగుచూశాయి. కొన్ని కేసుల్లో ఫోన్లు సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేయలేదు. వారి పిల్లలు గేమ్స్ ఆడటం వల్లే ఖాతాల్లోని డబ్బులు డెబిట్ అయ్యాయని గుర్తించారు. ఆన్‌లైన్‌లో ఆటలకు బానిసలుగా మారిన చిన్నారులు అందులో ఉన్న యూపీఐ ద్వారా లావాదేవీలు జరిపి గేమ్స్ ఆడుతున్నారు. 'ఫ్రీ ఫైర్', 'ఫ్రీ ఫైర్ మ్యాక్స్' వంటి ఆన్‌లైన్ మల్టీప్లేయర్ గేమ్స్‌కు అలవాటుపడి ఆ ఊబిలో చిక్కుకుంటున్నారు. ఈ మేరకు తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీపీ సజ్జనార్ పలు సూచనలు చేస్తూ దిశా నిర్దేశం చేశారు.

**తల్లిదండ్రులు సమయం కేటాయించక..**

హ్యాకింగ్, మోసపూరిత లింకులు లేవని, పిల్లలే 'ఫ్రీఫైర్', 'ఫ్రీ ఫైర్ మ్యాక్స్' వంటి ఆన్‌లైన్ మల్టీప్లేయర్ ఆటల్లో వర్చువల్ కాయిన్స్, డైమండ్స్ కొనుగోలు చేయడానికి ఫోన్‌లో సేవ్ చేసిన కార్డ్స్, యూపీఐలను వినియోగించారని తేలింది. ముఖ్యంగా.. పెద్దవాళ్లు, తాతయ్యలు, నానమ్మల ఫోన్లలో యూపీఐ, నెట్ బ్యాంకింగ్ లాగిన్ అయి ఉండటంతో పిల్లలు సులభంగా వేల రూపాయల లావాదేవీలు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న బిజీ లైఫ్‌లో తల్లిదండ్రులు పిల్లలతో సరైన సమయాన్ని కేటాయించలేకపోవడం వల్ల పిల్లలు ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలుగా మారుతున్నారని సజ్జనార్ పేర్కొన్నారు.




# తుపాకీ చూపించి దోపిడీకి స్కెచ్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ లో తుపాకీ చూపించి దోపిడీలు చేసేందుకు ప్లాన్ చేసిన ఇద్దరు క్రిమినల్స్ ను టాస్క్ ఫోర్స్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ డీసీపీ రఘునాథ్ వైభవ్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ కు చెందిన ముద్దసిర్ హూస్సేన్ ఇంటర్మీడియట్ వరకు చదివాడు. 2022లో ముంబయికి వెళ్ళి అక్కడ ఏబిల్ బాడీడ్ సీమెన్ కోర్సు చేశాడు. ఆ తర్వాత రెండు నెలల పాటు ఎల్ అండ్ టీ సంస్థలో పని చేశాడు. అనంతరం కమీషన్ ల మీద కారులను అద్దెకు ఇచ్చే వ్యాపారం చేశాడు. అదే విధంగా ముంబయి నుంచి కారులను కొనుగోలు చేసి వాటిని హైదరాబాద్ తో పాటు ఓఎల్ఎక్స్ ద్వారా అమ్మకాలు చేశాడు. ఈ సందర్భంలో ముద్దసిర్ హూస్సేన్ కు ముంబయి లో షోయబ్ ద్వారా సూరజ్ సింగ్ ను పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత సూరజ్ సింగ్ అతని అనుచరులతో కలిసి మహారాష్ట్రలో ఒక వ్యాపారీని కిడ్నాప్ చేశాడు, కర్ణాటకలో ఓ దోపిడీ కేసులో కూడా పాల్గొన్నాడు. ఈ రెండు కేసులలో సూరజ్ సింగ్ గ్యాంగ్ తో కలిసి జైలు కు వెళ్ళాడు. జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత సూరజ్ సింగ్ గ్యాంగ్ లోని సభ్యుడు ముద్దసిర్ హూస్సేన్ కు పిస్టల్ తో పాటు బుల్లెట్ లను ఇచ్చాడు. ఇటీవల హూస్సేన్ కు ఆర్థిక కష్టాలు రావడంతో తుపాకీతో బెదిరించి దోపిడీలు చేసేందుకు స్కెచ్ వేశాడు. ఈ దోపిడీల కోసం మహారాష్ట్రకు చెందిన అమీర్ ఖాన్ ను తనతో కలుపుకున్నాడు. ఈ దోపిడీలను చేసేందుకు కారులో అనుమానాస్పదంగా మైలార్ దేవ్ పల్లి ప్రాంతంలో సంచరిస్తుండగా సమాచారం అందుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు ఈ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో వీరి దగ్గర రెండు తొపాకులు, 7 బుల్లెట్ లు దొరికాయి. విచారణలో ఈ ఇద్దరు దోపిడీలకు ప్లాన్ చేశారని ప్రాథమిక ఆధారాలు లభించడంతో పోలీసులు అరెస్టు చేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రయత్నించినా సహించేది లేదని డీసీపీ హెచ్చరించారు. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విచారణలో వీరి పాత కేసులతో పాటు మొయినాబాద్ లో నమోదైన ఓ కేసులో కూడా వీరిద్దరు పాత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మహారాష్ట్రలో ఓ రాజకీయ ప్రముఖుడి సమీప బంధువును కిడ్నాప్ చేసిన కేసులో ముద్దసిర్ ఉన్నట్లు తేలింది.

- రాంపూర్ గ్రామంలో విజయవంతమైన విత్తన మేళా
- గ్రామంలో 'సర్' ను ప్రారంభించన సర్పంచ్
- ప్రభుత్వం అందించే అరుతడి పంటలు వేయాలని సర్పంచ్ సూచన
- యూరియా యాప్‌పై రైతులు పడుతున్న ఇబ్బందులపై మండిపడ్డా రాంపూర్ సర్పంచ్

# విజయవంతమైన విత్తన మేళా






**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని రాంపూర్ రైతు వేదికల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తనమేళా గురువారం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం గుర్తించిన వరి వంగడాలతో పాటు ఇతర విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎప్పటికప్పుడు పంటల మార్పిడితోనే దిగుబడులు వస్తాయని ఆ దిశగా రైతులు ముందడుగు వేయాలని వివరించారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ...
ఈ ఎడాది వర్షపాతం తక్కువ ఉన్నందున అరుతడి పంటలు వేయాలని సూచించారు. యూరియా యాప్ ద్వారా అసలైన రైతులకు యూరియా సరైన సమయంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా యాఫ్ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. అనంతరం గ్రామంలో ' సర్' ను గ్రామ నాయకులతో కలిసి ప్రారంబించారు. ఓటర్లు అందరూ సర్ పై అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ కోరారు. బిఎల్ఓలకు సహకరించి ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో
ఏఈఓ అనిత, మెదక్ పల్లి సర్పంచ్ అవురు చింతల రమేష్, ఉప సర్పంచ్‌లు సప్పిడి ఆంజనేయులు, కసిరెడ్డి సుధాకర్ రెడ్డి, డీలర్లు విష్ణు గౌడ్, వెంకటయ్య యాదవ్, దర్పుల రాజు, ముదిరాజ్ సోసైటి ప్రదాన కార్యదర్శి చిల్కం శేఖర్,, అంగన్వాడీ టీచర్ లక్ష్మీదేవి, బి ఎల్ ఓ కృష్ణారెడ్డి, రంగయ్య, రైతులు కృష్ణ రెడ్డి, పెంటయ్య, షర్ఫోద్దీన్, వెంకట్ రెడ్డి, బాలయ్య, రమేష్, మహేష్, మజీద్, శ్రీనివాసులు, అంజి తదితరులు పాల్గొన్నారు

# నల్లగొండ నాలుగు హత్యల కేసులో వీడిన మిస్టరీ...

**కుటుంబ ఆస్తి వివాదమే హత్యలకు కారణమని పోలీసుల నిర్ధారణ...**

**హసీన మొదటి భర్త కూతురు, అల్లుడు మరియు అల్లుడి అక్క కలిసి కుట్ర పన్నినట్లు గుర్తింపు....**



**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఇటీవల నల్లగొండ పట్టణంలో జరిగిన నాలుగు హత్యల కేసులో జిల్లా పోలీసులు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన డిఎస్పీ శివరాం రెడ్డి నేతృతంలో రంగంలోకి దిగినటువంటి పోలీసులు కేసును చేదించినట్లు సమాచారం. కేసు వివరాల ప్రకారం... హైదరాబాద్ పాతబస్తీకి చెందిన నలుగురు రౌడీషీటర్లతో హత్యలు చేయించినట్లు దర్యాప్తులో వెల్లడి ఐనట్లు పోలీసులు కేసు వివరాలను గురువారం విలేకరులకు వెల్లడించారు. హత్యకు గురైనవారు సుల్తాన్ (45), హసీన (40), ముజమిల్ (20), అక్సర (11), హసీన పేరుపై కోటి రూపాయల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు సమాచారం. ఆస్తిని ఇతరులకు కాకుండా సుల్తాన్ పిల్లలకు ఇవ్వాలనే నిర్ణయంపై కక్ష పెంచుకున్నట్లు అనుమానం, సుపారీ ఇచ్చి దారుణ హత్యలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తింపు. పోస్టుమార్టం నివేదికలో భయానక విషయాలు ,సుల్తాన్ శరీరంపై 6 కత్తిపోట్లు, హసీనపై 7 కత్తిపోట్లు, అక్సరపై 9 కత్తిపోట్లు, ముజమిల్‌పై ఏకంగా 16 కత్తిపోట్లు ఉన్నట్లు గుర్తింపు. హంతకులకు భయపడి మంచం కింద దాక్కున్న అక్సరను బయటకు లాగి హత్య చేసినట్లు అనుమానం, నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# డ్రగ్స్ మరియు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

## తలకొండపల్లి పోలీసుల ఆధ్వర్యంలో, జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు







**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని తలకొండపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వినియోగం మరియు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. తలకొండపల్లి ఇన్స్పెక్టర్ శ్రీ వి. జానకిరామ్ రెడ్డి మాట్లాడుతూ, నేటి యువత డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల బారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీనేజ్ వయసులోనే చెడు అలవాట్లకు బానిసై చదువును నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలు, ఎన్ డి పి ఎస్, ఆక్ట్ ప్రకారం పడే శిక్షల గురించి విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రుల కలలను నిజం చేయాలంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం సైబర్ నేరాల గురించి మాట్లాడుతూ, ఇంటర్ విద్యార్థులు ఎక్కువగా మొబైల్ ఫోన్లు వాడుతున్నారని, సోషల్ మీడియాలో ఫేక్ ప్రొఫైల్స్, మార్ఫింగ్ ఫోటోలతో బ్లాక్ మెయిల్, ఆన్‌లైన్ గేమ్స్ వ్యసనం, లోన్ యాప్ వేధింపులు, పార్ట్ టైం జాబ్ పేరుతో మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. అపరిచిత లింకులు క్లిక్ చేయవద్దని, ఇంటిని/, సివీవి, ఎవరికీ చెప్పవద్దని, సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలు షేర్ చేయవద్దని సూచించారు. సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. డ్రగ్స్ సంబంధిత సమాచారం ఉంటే డయల్ 100 కు లేదా స్థానిక పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది మరియు ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ బోల్తా.. యువకుడి దుర్మరణం



**దుమ్ముగూడెం,ఫ్లాష్ ఇండియా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం బైరాగులపాడు గ్రామ శివారులో గురువారం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన అంగిరేకుల రిషికేష్ (28) తీవ్రంగా గాయపడగా, మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రిషికేష్ ట్రాక్టర్‌తో పొలం పనుల వద్దకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో పొలం నుంచి ప్రధాన రహదారిపైకి ట్రాక్టర్‌ను ఎక్కించే సమయంలో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో ట్రాక్టర్ కింద చిక్కుకున్న అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ట్రాక్టర్ కింద నుంచి రిషికేష్‌ను బయటకు తీసి ముందుగా సమీప ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. అయితే పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రిషికేష్‌కు మూడు నెలల క్రితమే వివాహం జరిగింది. కొత్త జీవితాన్ని ప్రారంభించిన కొద్దిరోజులకే అతడు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి ఇంటి వద్ద విషాద వాతావరణం నెలకొనగా, యువకుడి అకాల మరణం బైరాగులపాడు గ్రామంలో విషాద ఛాయలు అలుముకునేలా చేసింది.

# ట్రాలీ ఆటో ఢీ.. యువకుడి దుర్మరణం

**చొప్పదండి,ఫ్లాష్ ఇండియా :** ట్రాలీ ఆటో ఢీ కొట్టిన ఘటనలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన చొప్పదండి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్నకొండ గ్రామానికి చెందిన గుంట మహేష్ (25), డిగ్రీ పూర్తి చేసి హమాలీగా పని చేసుకుంటున్నాడు. బుధవారం రాత్రి గం 11.30 లకు చొప్పదండిలో ఓ వివాహ వేడుకలో పాల్గొని తిరిగి ఇంటికి నడుచుకుంటూ వచ్చేక్రమంలో మర్లవాడ వద్ద చొప్పదండి నుంచి ధర్మారం వైపు వెళ్తున్నటువంటి ట్రాలీ ఆటో మహేష్ ను వెనుక నుంచి ఢీ కొట్టింది. ప్రభుత్వ ఆసుపత్రికి 108 అంబులెన్స్ లో తరలించి, తర్వాత మెరుగైన చికిత్స కోసం అపోలో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. తండ్రి భీరయ్య ఫిర్యాదు మేరకు డ్రైవర్ గుమ్మడి తిరుపతి పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ రెడ్డి తెలిపారు.

# నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన మంత్రి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్య సదుపాయాలు, పరిశుభ్రత, ఔషధాల లభ్యత, వైద్యులు, సిబ్బంది పనితీరు, తదితర అంశాలపై వైద్య అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులతో నేరుగా మాట్లాడి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి, వారి సహాయకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. ఖమ్మం జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవనం పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. భవనం ప్రారంభోత్సవానికి ముందే ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్ఠం చేయాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రధాన రహదారికి ఇరువైపులా ఆకర్షణీయమైన మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మంత్రి సూచించారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా పరిశుభ్ర వాతావరణం ఉండాలని, అంతర్గత రహదారులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచి గుంతలు లేకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆసుపత్రుల్లో ప్రతి రోగి సంతృప్తి చెందే విధంగా సేవలు అందించాలని మంత్రి అన్నారు.

**ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా విడివోస్ కాలనీలో ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించిన మంత్రి...**


ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నియోజకవర్గంలోని విడివోస్ కాలనీలో కొనసాగుతున్న ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను మంత్రి పరిశీలించారు. ఇంటింటి సర్వే, వివరాల నమోదు ప్రక్రియ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, వేగవంతంగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, వైద్య శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.



# సచిన్ లాంటి ప్రతిభ కానీ..

భారత క్రికెట్‌లో ప్రస్తుతం అత్యంత చర్చ-నీయాంశంగా మారిన ప్లేయర్ యువ సంచలనం 'వైభవ్ సూర్యవంశీ'. కేవలం 15 ఏళ్ల వయసులోనే రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తున్న ఈ యువ సంచలనం.. భవిష్యత్తు భారత స్టార్‌గా ఇప్పటికే గుర్తింపు పొందాడు. ముఖ్యంగా ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆరెంజ్ క్యాప్‌తో పాటు 'మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్' (ఎంవీపీ) అవార్డును కూడా సొంతం చేసుకుని అందరి దృష్టిని ఆకర్షించాడు. అయితే వైభవ్ ప్రతిభపై ప్రశంసలు కురిపించిన భారత 1983 ప్రపంచకప్ విజేత కెప్టెన్ కపిల్ దేవ్.. అతనిపై ఇప్పుడే భారీ అంచనాలు ఉంచడం సరైంది కాదన్నాడు. వైభవ్ భవిష్యత్తును అంచనా వేయడానికి ఇంకా సమయం అవసరమని పేర్కొన్నాడు.'వైభవ్ సూర్యవంశీ ఇంకా చాలా చిన్నవాడు. కానీ అతను ప్రత్యేకమైన ప్రతిభ కలిగిన ఆటగాడనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. ప్రస్తుతం అతని ప్రపంచం మొత్తం క్రికెట్ మాత్రమే. వైభవ్ వయసు ఇప్పుడు 15. 20-22 ఏళ్ల వయసుకు చేరుకున్న తర్వాత అతని కెరీర్‌ను అంచనా వేయవచ్చు. ప్రతిభ మాత్రం అసాధారణం' అని కపిల్ దేవ్ చెప్పాడు. అంతేకాకుండా వైభవ్‌ను భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో పోల్చాడు. '16 ఏళ్ల వయసులో సచిన్ ఎలా ఆడాడో, వైభవ్ కూడా అలాంటి ప్రతిభను కలిగి ఉన్నాడు. కానీ సచిన్‌లా చాలా కాలం పాటు నిలకడగా రాణించగలడా లేదా అనేది భవిష్యత్తే నిర్ణయిస్తుంది. అతడు ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది' అని చెప్పాడు.వైభవ్‌పై అధిక అంచనాలు పెట్టుకోవద్దని కపిల్ దేవ్ ఇదివరకు కూడా సూచించాడు. యువ ఆటగాడికి గౌరవం ఇవ్వడం తప్పు కాదని, కానీ అతను జాతీయ జట్టులోకి కొత్తగా వచ్చిన ఈ దశలో అతని నుంచి అద్భుతాలు ఆశించడం సరికాదని పేర్కొన్నాడు. 'క్లబ్ క్రికెట్ ఆడటం వేరు, దేశం కోసం ఆడటం వేరు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఒత్తిడి, బాధ్యతలు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. కాబట్టి అతనికి సమయం ఇవ్వాలి. వెంటనే భారీ అంచనాలు పెట్టి ఒత్తిడి తీసుకురావద్దు' అని కపిల్ దేవ్ అభిప్రా-యపడ్డాడు. ఇటీవల శ్రీలంకలో జరిగిన ట్రై-నేషన్ 'ఏ' సిరీస్‌లో కూడా వైభవ్ చెలరేగిపోయాడు. ఫైనల్లో కేవలం 29 బంతుల్లో 94 పరుగులు చేసి భారత్ 'ఏ' జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. 11 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసి లిస్ట్-ఏ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. త్వరలో ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలో భారత సీనియర్ టీ20 జట్టుకు అరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నాయి.

# మెస్సి రికార్డును బద్దలు కొట్టిన రొనాల్డో..



ఫుట్‌బాల్ దిగ్గజ ప్లేయర్లు లియోనెల్ మెస్సి, క్రిస్టియానో రొనాల్డో ల మధ్య పోరు ఫిఫా వరల్డ్ కప్ 2026లోనూ తారాస్థాయికి చేరింది. అర్జెంటీనా స్టార్ మెస్సి ఆల్‌టైమ్ వరల్డ్ కప్ రికార్డు సృష్టించిన మరుసటి రోజే పోర్చుగల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో తనదైన శైలిలో బదులిస్తూ ఫుట్‌బాల్ చరిత్రలోనే ఎవరికీ సాధ్యంకాని సరికొత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు.'గ్రూప్ కె'లో భాగంగా ఉజ్బెకిస్తాన్ తో జరిగిన మ్యాచ్‌లో పోర్చుగల్ 5-0తో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో రొనాల్డో రెండు అద్భుతమైన గోల్స్‌తో వీరవిహారం చేశాడు. ఈ ప్రదర్శనతో 6 వేర్వేరు ప్రపంచ కప్ ఎడిషన్లలో గోల్స్ సాధించిన ప్రపంచంలోనే మొట్టమొదటి ఫుట్‌బాలర్‌గా రొనాల్డో చరిత్ర సృష్టించాడు. మెస్సి కూడా 6 ప్రపంచ కప్‌లు ఆడినప్పటికీ 2010 ఎడిషన్‌లో ఆయన గోల్ చేయలేకపోవడంతో ఈ అరుదైన రికార్డు ఒక్క రొనాల్డోకు మా-త్రమే సొంతమైంది.

# గిల్‌కు ప్లస్ పాయింట్..



ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా ఆటగాళ్లు సంచలనం సృష్టించారు. అఫ్గానిస్తాన్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసిన భారత్.. ర్యాంకింగ్స్‌లోనూ అదరగొట్టింది. ముఖ్యంగా భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అద్భుత ఫామ్‌తో ఏకంగా మూడు స్థానాలు ఎగబాకి ప్రపంచ నంబర్ 2 స్థానానికి చేరుకున్నాడు. ఈ క్రమంలోనే గిల్ తన సహచర ఆటగాడు, రన్ మెషిన్ విరాట్ కోహ్లీని వెనక్కి నెట్టడం విశేషంగా మారింది. అఫ్గానిస్తాన్‌పై జరిగిన సిరీస్‌లో గిల్ మొదటి వన్డేలోనే 84 పరుగులతో రాణించడమే కాకుండా, రెండో వన్డేలో 154 పరుగుల వీరోచిత సెంచరీతో అఫ్గాన్ బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. ఈ అమోఘమైన ప్రదర్శనకు గానూ అతనికి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కడంతో పాటు ర్యాంకింగ్స్‌లోనూ దూసుకుపోయాడు.మరోవైపు, గత కొంతకాలంగా రెండో స్థానంలో స్థిరంగా కొనసాగుతున్న విరాట్ కోహ్లీ ఇప్పుడు మూడో స్థానానికి పడిపోయాడు. ఆర్‌సీబీ, జీటీ మధ్య జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో కుడి కాళ్లకు తగిలిన గాయం (రైట్ హామ్‌స్ట్రింగ్ ఇంజూరీ) కారణంగా కోహ్లీ ఈ అఫ్గాన్ సిరీస్‌కు దూరం కావాల్సి వచ్చింది. కోహ్లీ మ్యాచ్‌లో లేకపోవడం గిల్‌కి కలిసి వచ్చింది. ఇదే అదునుగా గిల్ రేటింగ్‌లో కోహ్లీని అధిగమించాడు. ఇక టీమిండియా సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ 115 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో ఈ సిరీస్‌లో మొత్తం 143 పరుగులు చేశాడు. ఇందులో చివరి రెండు మ్యాచ్‌ల్లో ఆడిన 48, 79 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ సైతం ఉన్నాయి. దీంతో రోహిత్ వన్డే ర్యాంకింగ్స్‌లో తన నాలుగో స్థానాన్ని విజయవంతంగా పదిలం చేసుకున్నాడు.అయితే, ర్యాంకింగ్స్ రేసులో ఈ అగ్రస్థానాల పోరు రాబోయే రోజుల్లో మరింత ఆసక్తికరంగా మారనుంది. గాయం నుంచి కోలుకున్న విరాట్ కోహ్లీ వచ్చే జూలై నెలలో ఇంగ్లాండ్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ద్వారా తిరిగి మైదానంలోకి అడుగుపెట్టబోతున్నాడు. అక్కడ గిల్‌తో పోటీపడుతూ తన నంబర్ 2 స్థానాన్ని తిరిగి దక్కించుకోవాలని కోహ్లీ చూస్తుంటే.. అటు రోహిత్ శర్మ సైతం మరింత పైకి ఎగబాకాలని భావిస్తున్నాడు. భారత అభిమానులంతా ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఈ భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ వన్డే సిరీస్ షెడ్యూల్ ప్రకారం.. మొదటి వన్డే జూలై 14 (మంగళవారం) మధ్యాహ్నం 3:30 గంటలకు బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో జరగనుంది. ఆ తర్వాత రెండో వన్డే జూలై 16 (గురువారం) సాయంత్రం 5:30 గంటలకు కార్డిఫ్‌లోని సోఫియా గార్డెన్స్‌లో, అలాగే చివరిదైన మూడో వన్డే జూలై 19 (ఆదివారం) మధ్యాహ్నం 3:30 గంటలకు లండన్‌లోని చారిత్రాత్మక లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో జరగనున్నాయి. ఇక, ఈ మ్యాచ్‌లో కోహ్లీ.. గిల్‌ను అధిగమిస్తాడా? వేచిచూద్దాం..

# వైభవ్ తమ్ముడూ చిచ్చర పిడుగే..



వైభవ్ సూర్యవంశీ.. క్రికెట్ ప్రపంచాన్ని తనవైపు తిప్పుకున్న 15 ఏళ్ల కుర్రాడు. ఐపీఎల్‌లో విధ్వంసకర ఇన్నింగ్స్‌లు ఆడి 15 ఏళ్లకే ఏకంగా టీమిండియా నుంచి పిలుపు అందుకున్నాడు. వైభవే కాదు అతని తమ్ముడు కూడా చిచ్చరపిడుగే. బుధవారం బిహార్‌లో జరిగిన ఓ లోకల్ మ్యాచ్‌లో 10 ఏళ్ల ఆశీర్వాద్ సూర్యవంశీ సెంచరీ బాది వార్తల్లో నిలిచాడు. 'రిషవ్ 11' జట్టుకు ఆడిన అతను అదిరే ప్రదర్శన చేశాడు. 'రౌషన్ 11'తో ఆడిన మ్యాచ్‌లో 119బంతుల్లో 168 రన్స్ చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 19 ఫోర్లు, 6 సిక్సర్లు ఉన్నాయి. అతని మెరుపులతో 'రిషవ్ 11' జట్టు 40 ఓవర్లలో 311/7 స్కోరు చేసింది. తన తమ్ముడి ప్రదర్శనను తెలియజేస్తూ వైభవ్ సోషల్ మీడియాలో ఫోటో పెట్టాడు. దీంతో ఆ పోస్టు వైరల్‌గా మారగా.. వైభవ్‌లాగే అతని తమ్ముడూ చిచ్చరపిడుగేనని ప్రశంసిస్తున్నారు. త్వరలోనే ఆశీర్వాద్ కూడా ఐపీఎల్ ఇస్తాడని కామెంట్లు పెడుతున్నారు. ఈ గేముకు ముందు కూడా ఆశీర్వాద్ బిహార్‌లో జరిగిన మ్యాచ్‌లో తేజ్‌పూర్ క్రికెట్ అకాడమీ తరపున ఆడి శతకం బాదాడు. 87 బంతుల్లో 103 పరుగులు చేశాడు. కాగా వైభవ్‌కు అన్న ఉజ్వల్, తమ్ముడు ఆశీర్వాద్ ఉన్నారు.

# బిజినెస్



# 72 డాలర్ల వద్దకు చేరిన బ్రెంట్ క్రూడ్..

అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు ఫలప్రదం కావడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడ్ ధర యుద్ధానికి ముందు ఉన్న స్థాయికి అంటే బ్యారెల్‌కు 72.48 డాలర్ల వద్దకు పడిపోయింది. అయినప్పటికీ, దేశీయంగా ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీ లు పెట్రోల్, డీజిల్ ధరలలో ఎలాంటి మార్పులు చేయలేదు. దేశవ్యాప్తంగా ఇంధన ధరలు స్థిరంగానే కొనసాగుతున్నాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల సమయంలో దేశంలో నాలుగు సార్లు ఇంధన ధరలు పెరిగాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి లీటర్ పెట్రోల్, డీజిల్‌పై దాదాపు రూ.7.5 నుంచి రూ.8 వరకు భారం పడింది. అయితే, వాషింగ్టన్, టెహ్రాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో జరిగిన చర్చలు సఫలం కావడంతో చమురు సరఫరాపై ఆందోళనలు తొలిగి, క్రూడ్ ధరలు దిగివచ్చాయి.

**ప్రధాన నగరాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు ఇలా..**

హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ రూ.115.73 ఉండగా.. డీజిల్ రూ.103.82గా ఉంది. ఇక దేశ రాజధాని న్యూఢిల్లీలో లీటరు పెట్రోల్ రూ.102.12, డీజిల్ రూ.95.20, ముంబైలో పెట్రోల్ రూ.111.21, డీజిల్ రూ.97.83, బెంగళూరులో పెట్రోల్ రూ.110.89, డీజిల్ రూ.98.80, చెన్నైలో పెట్రోల్ రూ.108.01, డీజిల్ రూ.99.66, కోల్‌కతాలో లీటరు పెట్రోల్ రూ.113.51, డీజిల్ ధర రూ.99.82గా ఉంది.

# బలపడుతున్న రూపాయి..




బుధవారం భారీ లాభాలను ఆర్జించిన దేశీయ సూచీలు గురువారం కూడా అదే జోష్‌తో ప్రారంభమయ్యాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి (94.28) బలపడడం సూచీలకు సానుకూలంగా మారింది. అలాగే ఇటీవల భారీగా పెరిగిన క్రూడాయిల్ ధరలు క్రమంగా దిగి వస-్తున్నాయి. మరోవైపు అమెరికా-భారత్ మధ్య ట్రేడ్ డీల్ అతి త్వరలో కుదరనుందనే సంకేతాలు కూడా పాజిటివ్‌గా మారాయి. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతున్నాయి.గత సెషన్ ముగింపు (76,991)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు 400 పాయింట్ల లాభాలతో మొదలైన సెన్సెక్స్ అదే జోరు కొనసాగిస్తోంది. ఉదయం 9:30 గంటల సమయంలో సెన్సెక్స్ 427 పాయింట్ల లాభంతో 77,418 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతం 121 పాయింట్ల లాభంతో 24,143 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో అశోక్ లేలాండ్, ఎమ్ అండ్ ఎమ్, లోధా డెవలపర్స్, ఫోర్స్ మోటార్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి. నాల్కో, ఎల్ఐసీ ఇండియా, కేఈఐ ఇండస్ట్రీస్, వేదాంతా, హిందుస్థాన్ జింక్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 266 పాయింట్ల లాభంతో ఉంది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 128 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది.

# గ్యాస్ సిలిండర్ ధరలు



ఇటీవల గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధరలను ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు రూ. 29 పెంచుతూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ పెంచిన ధరలు జూన్ 7వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి.

తాజా పెంపుతో ప్రస్తుతం హైదరాబాద్‌లో గృహ వినియోగ ఎల్‌పిజి(14.2 కేజీల) సిలిండర్ ధర రూ.994.00గా ఉంది. ఇక, హైదరాబాద్‌లో ప్రస్తుతం కమర్షియ-ల్ సిలిండర్ ధర రూ.3,367గా ఉంది. ఈ తరుణంలో ఇవాళ(జూన్ 25) రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడలో గ్యాస్ సిలిండర్ ధరలు ఏ విధంగా ఉన్నాయో చూద్దాం.

**ఈ రోజు గ్యాస్ సిలిండర్ ధరలు**

హైదరాబాద్: రూ.994.00
వరంగల్: రూ.1013.00
విశాఖపట్నం: రూ.950.00
విజయవాడ: రూ.966.50
గుంటూరు: రూ.966.50



# రాజీనామాల బాంబ్ ..

ప్రముఖ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ 'స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ' మేనేజ్‌మెంట్‌లో కీలక మా-ర్పులు చోటుచేసుకున్నాయి. కంపెనీలో అగ్రశ్రేణి స్థానాల్లో ఉన్న ఇద్దరు టాప్ ఎగ్జిక్యూటివ్‌లు తమ పదవులకు రాజీనామా చేశారు. ఇన్‌స్టామార్ట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అంకిత్ జైన్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ హరి కుమార్ వ్యక్తిగత కారణాల వల్ల సంస్థను వీడుతున్నట్లు తాజాగా ప్రకటించారు. వీరిద్దరూ గతంలో ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం 'ఫ్లిప్‌కార్ట్'లో పనిచేసి, ఆ తర్వాత స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో చేరడం గమనార్హం. ప్రస్తుతం ఇన్‌స్టామార్ట్ సీఈఓ అమితేష్ ఝా (ఈయన కూడా ఫ్లిప్‌కార్ట్ మాజీ ఉద్యోగే) నేతృత్వంలో వీరు కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

**కీలక బాధ్యతల్లో ఉంటూనే సంచలన నిర్ణయం..**

గత ఏడాది మే నెలలో ఇన్‌స్టామార్ట్‌లో చేరిన అంకిత్ జైన్.. క్విక్ కామర్స్ బిజినెస్ ఆపరేషన్స్, డార్క్ స్టోర్ మేనేజ్‌మెంట్, నెట్‌వర్క్ డిజైన్, స్టాక్ ప్లానింగ్ వంటి కీలక విభాగాలను పర్యవేక్షించేవారు. హరి కుమార్ నవంబర్ 2024లో ఇన్‌స్టామార్ట్ టీమ్‌లో చేరి బిజినెస్ విభాగాన్ని ముందుకు నడిపించారు.

**కొత్త నాయకత్వం కోసం అన్వేషణ..**

ఇద్దరు కీలక అధికారులు తప్పుకోవడంతో స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ మేనేజ్‌మెంట్ వెంటనే అలర్ట్ అయింది. ఖాళీ అయిన ఈ పదవుల భర్తీ కోసం కొత్త వ్యక్తుల అన్వేషణను స్టార్ట్ చేసింది. త్వరలోనే సీనియర్ మేనేజ్‌మెంట్ స్థాయిలో మరికొన్ని కీలక నియామకాలు జరిగే అవకాశం ఉందని, ప్రస్తుతం సంస్థ పలు మేనేజ్‌మెంట్ రోల్స్ కోసం రిక్రూట్‌మెంట్ ప్రక్రియను వేగవంతం చేసిందని సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే స్విగ్గీ బోర్డు స్థాయిలో కూడా కొన్ని మార్పులు జరిగాయి. కంపెనీ కో-ఫౌండర్, ఇన్నోవేషన్ హెడ్ నందన్ రెడ్డి బోర్డు నుంచి తప్పుకోగా.. వారి స్థానంలో కో-ఫౌండర్ ఢ చీఫ్ గ్రోత్ ఆఫీసర్ ఫణి కిషన్ అద్దేపల్లి, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రాహుల్ బోత్రాలను బోర్డులోకి తీసుకున్నారు.

**మార్కెట్ పోటీని తట్టుకునేందుకేనా..**

ప్రస్తుతం దేశీయ క్విక్ కామర్స్ మార్కెట్‌లో విపరీతమైన పోటీ నెలకొంది. ఆర్డర్ల వాల్యూమ్ పరంగా చూస్తే బ్లింకిట్ , జెప్టో మొదటి రెండు స్థానాల్లో ఉండగా, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ మూడో స్థానంలో కొనసాగుతోంది. కస్టమర్లను ఆకర్షించేందుకు కంపెనీలు భారీగా డిస్కౌంట్లు ఇస్తుండటంతో పాటు.. అమెజాన్ ఇండియాకు చెందిన 'అమెజాన్ నౌ', ఫ్లిప్‌కార్ట్ అందిస్తున్న 'మినిట్స్' వంటి సేవలు కూడా మార్కెట్లోకి రావడంతో పోటీ మరింత తీవ్రమైంది. ఈ నేపథ్యంలోనే ఇన్‌స్టామార్ట్ తన మేనే-జ్‌మెంట్‌ను మరింత బలోపేతం చేసుకునే పనిలో పడిందని చెబుతున్నారు.




# నాగ దుర్గ 'ఇడుపు కాయితం'

సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్లపై ప్రియదర్శి, నాగ దుర్గ జంటగా ఓ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు తాజాగా పూర్తికాగా, అదే సందర్భంగా మూవీ యూనిట్ టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. ఈ చిత్రానికి 'ఇడుపు కాయితం' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చూస్తుంటే, ఇది పల్లెటూరి నేపథ్యంతో కూడిన ఓ స్వచ్ఛమైన ప్రేమకథగా తెరకెక్కుతున్నట్లు అర్థమవుతోంది. పోస్టర్‌లో హీరో, హీరోయిన్ బైక్‌పై ప్రయాణిస్తూ కనిపించడం, హీరోయిన్ సంప్రదాయ దుస్తుల్లో కనిపించడం, చుట్టూ ఉన్న సామాన్లు, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే అంశాలు కలిపి ఈ చిత్రంలో మధురమైన భావోద్వేగ ప్రేమకథ ఉండబోతోందనే సంకేతాలు ఇస్తున్నాయి.

ముఖ్యంగా పోస్టర్‌లో కనిపిస్తున్న విజువల్స్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచేలా ఉన్నాయి. వంశీ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాకు సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తున్నారు.



# ఎన్టీఆర్ పాటల్లో లేవా బూతులు?


సినిమా ఇండస్ట్రీ సాహిత్యంలో బోల్డ్‌నెస్ మరియు సోషల్ మీడియా వేదికగా సాగుతున్న విమర్శలపై ప్రముఖ సింగర్ సునీత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు ముద్దు సీన్లు ఉంటే పూలు చూపించేవారని, కానీ ఇప్పుడు ఫిల్టర్లు లేకుండా డైరెక్ట్‌గా బోల్డ్ సీన్స్, డార్క్ సబ్జెక్ట్స్ చూపిస్తున్నప్పుడు దానికి తగ్గట్టుగానే సంభాషణలు, లిరిక్స్ కూడా మారుతాయని ఆమె స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో పాత తరం పాటలతో పోలుస్తూ ప్రస్తుతం నెట్టింట జరుగుతున్న రచ్చపై సునీత గట్టిగా మాట్లాడారు."ఒకప్పుడు వేటూరు గారి పాటల్లో కానీ, ఎన్టీఆర్ గారి కాలంలో వచ్చిన సినిమాల్లో కానీ డబుల్ మీనింగ్ సాంగ్స్ లేవా? అసలు ఆ టైంలో వచ్చిన ఐటెం సాంగ్స్ ఒకసారి కూర్చొని వినండి.. అందులో ఎన్ని బూతులు ఉన్నాయో మీకే అర్థమవుతుంది. నేను ఎవరినీ సమర్థించడం లేదు. కానీ, అప్పట్లోనూ దారుణమైన సాహిత్యం ఉంది, ఇప్పుడూ ఉంది. కాకపోతే అప్పట్లో ఒక అందమైన ప్యాకేజింగ్‌తో చెప్పేవారు, ఇప్పుడు నేరుగా చెప్తున్నారు, అంతే తేడా!" అని సునీత అన్నారు. ఈ రోజుల్లో ప్రతి చిన్న విషయానికి ఇంత రచ్చ జరగడానికి కారణం సోషల్ మీడియానే అని సునీత విమర్శించారు. నెటిజన్లు ప్రతి విషయాన్ని హైలైట్ చేస్తూ, కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్లుగా చిన్న చిన్న పాయింట్స్ పట్టుకుని వివాదాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "సమాజంలో ఏ చిన్న విషయం జరిగినా, ప్రతి ఒక్కరూ అక్కడ తమ పాయింట్ ఆఫ్ వ్యూ చెప్పకపోతే ఏదో తప్పు జరిగిపోతుందనే ఫీలింగ్‌లో బతుకుతున్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి చోటా తమ అభిప్రా-యాలు చెప్పాల్సిన అవసరం లేదు. ఆ అలవాటు మానేస్తే ఈ అనవసరపు గొడవలు, ట్రోలింగ్స్ దానంతట అవే తగ్గుతాయి" అని ఆమె హితవు పలికారు.

# 'వారణాసి' ఓటీటీ డీల్ సెట్టా...

భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రాల్లో ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న 'వారణాసి' ఒకటి. షూటింగ్ ఇంకా కొనసాగుతుండగానే ఈ సినిమా గురించి వస్తున్న ప్రతి చిన్న అప్‌డేట్ దేశవ్యాప్తంగా సినీ అభిమానుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే 1,200 కోట్ల భారీ బడ్జెట్, ఇంటర్నేషనల్ ఎలిమెంట్స్ తో సాగే కథతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. అలాంటి సమయంలో ఇప్పుడు మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వచ్చింది. 'వారణాసి' ఓటీటీ హక్కులు ఇప్పటికే నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుందా? లేక ఇంకా చర్చల దశలోనే ఉన్నాయా? నెట్‌ఫ్లిక్స్ ఇండియా ఉన్నతాధికారి చేసిన ఒక్క వ్యాఖ్య ఇప్పుడు సోషల్ మీడియాలో కొత్త చర్చకు తెరలేపింది. అసలు ఆమె ఏమన్నారు? ఈ ఊహాగానాలకు కారణమేంటి? నెట్‌ఫ్లిక్స్ తొలి తెలుగు ఒరిజినల్ సిరీస్ 'సూపర్ సుబ్బు' ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఈ ప్రశ్న ఎదురైంది. 'వారణాసి' స్ట్రీమింగ్ హక్కులు నెట్‌ఫ్లిక్స్ సొంతమయ్యాయా అని అడగ్గా, నెట్‌ఫ్లిక్స్ ఇండియా కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ మోనికా షెర్గిల్ చిరునవ్వుతో స్పందించారు. కొన్ని విషయాలు భవిష్యత్తులోనే సర్‌ప్రైజ్‌గా ఉండాలని ఆమె చెప్పడంతో అక్కడున్న వారిలో ఆసక్తి మరింత పెరిగింది. అధికారికంగా ఎలాంటి ధృవీకరణ ఇవ్వకపోయినా, ఆమె సమాధానం ఓటీటీ ఒప్పందంపై ఓ క్లారిటీ ఇచ్చింది.




అంతేకాదు రాజమౌళి గత చిత్రాలైన 'బాహుబలి' సిరీస్, 'ఆర్ఆర్ఆర్' ప్రపంచవ్యాప్తంగా నెట్‌ఫ్లిక్స్ ద్వారా విశేష ఆదరణ పొందాయని గుర్తు చేసినప్పుడు, గొప్ప కథలు, టాలెంట్ క్రియేటర్స్ ఎప్పుడూ నెట్‌ఫ్లిక్స్‌తో కలిసి ప్రయా-ణిస్తారని మోనికా వ్యాఖ్యానించారు. దీంతో 'వారణాసి' డిజిటల్ హక్కుల కోసం నెట్‌ఫ్లిక్స్ భారీ మొత్తాన్ని ఆఫర్ చేసినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ఊహాగానాలు మరింత బలపడ్డాయి. అయితే ఇప్పటివరకు ఈ ఒప్పందంపై చిత్ర బృందం నుంచి, నెట్‌ఫ్లిక్స్ నుంచి అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు.



# అదృష్టంగా ఫీల్ అవుతున్నా

తాజాగా, జరిగిన టైటిల్ రివీల్ వేడుకల్లో రాశి ఖన్నా పాల్గొని ఎమోషనల్ అయ్యారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు 'ధర్మన్: ది డెడ్లీ డాక్టర్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. అయితే ఇందులో నటించడంపై రాశి ఖన్నా మాట్లాడుతూ.. "ఈ ప్రతిష్టాత్మక చిత్రం 'ధర్మన్'లో నేను కూడా ఒక భాగం కావడం నాకెంతో సంతోషంగా ఉంది. సూపర్ స్టార్ రజినీకాంత్ సార్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడానికి నేను చాలా ఎగ్జైటింగ్‌గా ఎదురుచూస్తున్నాను. ఇండస్ట్రీలో ఉండే ప్రతి ఒక్కరికీ రజినీ సార్‌తో ఒక్కసారైనా నటించాలనే పెద్ద డ్రీమ్ ఉంటుంది. ఇప్పుడు నా కల నిజమవుతున్నందుకు నేను చాలా అదృష్టంగా ఫీల్ అవుతున్నాను. అలాగే ఈ లక్కీ ఛాన్స్ ఇచ్చిన కమల్ హాసన్ సార్‌కి నా ప్రత్యేక ధన్యవాదాలు తెలిజేస్తున్నాను. కమల్ సార్ లాంటి లెజెండ్ వద్ద పని చేయడం గొప్ప అనుభూతి. ఈ సినిమా షూటింగ్ సెట్‌లో రజినీ సార్, కమల్ సార్‌ల నుంచి నటనకు సంబంధించి ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవాలని ఆశపడుతున్నాను" అంటూ చెప్పుకొచ్చారు. ఇక ఈ సినిమా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ప్రతిరోజూ భయంతో గడపాల్సిన పరిస్థితి వచ్చింది..



ప్రస్తుతం సోషల్ మీడియా హవా ఏ రేంజ్‌లో ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రపంచంలో ఎక్కడ ఏ చిన్న విషయం జరిగినా క్షణాల్లో అందరికీ తెలిసిపోతోంది. అయితే ఈ సోషల్ మీడియాను చాలామంది తమ కెరీర్ ఎదుగుదలకు వాడుకుంటున్నారు. కానీ, ఇదే సోషల్ మీడియా కొందరికి పెద్ద శాపంగా మారుతోంది. సెలబ్రిటీలు ఎప్పుడు ఏ చిన్న మాట మాట్లాడినా.. దాని వల్ల ఎలాంటి ట్రోలింగ్ ఎదుర్కోవాల్సి వస్తుందోనని షాక్ తగిలినట్లు భయపడిపోతున్నారు. ఒక్కోసారి వారు సాధారణంగా చేసిన వ్యాఖ్యలను కూడా నెటిజన్లు తప్పుగా అర్థం చేసుకుని తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ భయం వల్ల కొందరు సెలబ్రిటీలు తాము చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్తుంటే.. మరికొందరు విమర్శలు తట్టుకోలేక సోషల్ మీడియాకే దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో, తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న సోషల్ మీడియా ట్రోలింగ్ గురించి చేసిన వ్యాఖ్యలు నెట్టింట పెద్ద చర్చనీయాంశంగా మారాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో బయట ఏ విషయం మాట్లాడాలన్నా తనకు చాలా భయమేస్తోందని రష్మిక ఆవేదన వ్యక్తం చేసింది. తాను ఏదైనా మాట్లాడితే.. దాన్ని పూర్తిగా మార్చేసి, వేరే విధంగా బయటకు ప్రచారం చేస్తున్నారని తెలిపింది. అసలు తాను అనని విషయాలను కూడా అన్నట్లుగా క్రియేట్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని రష్మిక చెప్పుకొచ్చింది. దీనివల్ల రోజూ ఉదయం లేవగానే.. తన గురించి నెట్‌లో ఎలాంటి తప్పుడు ప్రచారం జరుగుతుందో, ఎలాంటి రూ-మర్ వస్తుందోనని నిత్యం భయంతో గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎమోషనల్ అయ్యారు. సోషల్ మీడియా ద్వారా మనుషులు ఎదగడం చాలా మంచి విషయమే కానీ.. కొందరు మాత్రం దాన్ని ఇతరులను తక్కువ చేయడానికి, తప్పుగా వాడుకోవడానికి ఉపయోగించడం అస్సలు బాగోలేదని రష్మిక స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. అభిమానులు ఆమెకు అండగా నిలుస్తున్నారు.



# 'రణబాలి'కి హైలైట్ అదే..

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న చిత్రం 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్ర షూటింగ్ దాదాపు పూర్తయింది. తాజాగా ఈ మూవీ గురించి దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కొన్ని ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. రాహుల్ మాట్లాడుతూ, 'రణబాలి' చిత్రంలో ఎన్నో అద్భుతమైన సన్నివేశాలు ఉన్నప్పటికీ, వాటిలో విజయ్ దేవరకొండ మరియు విలన్ ఆర్నాల్డ్ వోస్లూ మధ్య వచ్చే క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ సినిమాకే అతిపెద్ద హైలైట్‌గా నిలుస్తుందని చెప్పారు. ఈ యాక్షన్ ఎపిసోడ్‌ను ఏకంగా 15 రోజుల పాటు చిత్రీకరించామని, ఇది అన్ని వర్గాల ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుందని ఆయన వెల్లడించారు. ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాల గురించి దర్శకుడు ఇంత నమ్మకంగా మాట్లాడడంతో, 'రణబాలి'పై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఇప్పటికే విజయ్ దేవరకొండ--రాహుల్ సంకృత్యాన్ కాంబినేషన్‌లో వచ్చిన 'టాక్సీవాలా' మంచి విజయం సాధించిన నేపథ్యంలో, ఈ సినిమా కూడా అదే స్థాయిలో సక్సెస్ అందుకుంటుందనే నమ్మకంతో అభిమానులు ఉన్నారు. మరి 'రణబాలి' బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**